

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 15 ఆగస్టు 2021 సంపుటి : 03 సంచిక :12 పేజీలు : 4 వెల : రూ 3-00


## దేశ ప్రజలకు ఉపరాష్ట్రపతి స్వాతంత్ర్య దినోత్సవ సందేశం



న్యూఢిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుదేశ ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశం స్వరాజ్యం సముపార్జించుకుని 75 ఏళ్ళ మైలురాయిని చేరుకుంటున్న ఈ తరుణంలో, దేశం స్వేచ్ఛా వాయువులు పీల్చడం కోసం ఎన్నో త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో, వారి ధైర్యం, దేశభక్తిని ప్రేరణగా తీసుకుందాం. ఈ సందర్భంలో దేశ పురోగతి మరియు, శ్రేయస్సు కోసం పాటుపడడం ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని ఆశిస్తున్నానని అన్నారు. దేశంలోని అన్ని స్థాయిల ప్రజలకు అభివృద్ధి ప్రయోజనాలు అందిచడం, గౌరవప్రదమైన జీవితాన్ని అందేలా చూడాలి. మనకున్న దాన్ని నలుగురితో పంచుకోవడం, నలుగురి సంక్షేమం పట్ల శ్రద్ధ వహించడం (షేర్ అండ్ కేర్) వంటి భారతీయ విలువలను ఆదర్శంగా తీసుకుని, మన పౌరులందరికీ భద్రత, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం అనే రాజ్యాంగపరమైన ఆదర్శాన్ని సాధించేందుకు కలిసి పని చేద్దామన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ సంతోషకరమైన సందర్భాన్ని పురస్కరించుకుని మన అంతర్గత శక్తులను తిరిగి ఆవిష్కరించుకునేందుకు, మన ప్రజల అపారమైన సామర్థ్యాన్ని గ్రహించేందుకు, వివిధ దేశాల సహకారంలో భారతదేశానికి సముచిత స్థానం సంపాదించుకునేందుకు అందరం పునరంకితమయ్యే దిశగా ప్రతిన బూనుదామన్నారు.

## ఏపీలో కరోనా కట్టడి చర్యలు బాగున్నాయి: ఢిల్లీ ఎయిమ్స్ డైరెక్టర్



అమరావతి : ఏపీలో కరోనా కట్టడి చర్యలు బాగున్నాయని ఢిల్లీ ఎయిమ్స్ డైరెక్టర్ రణదీప్ గులేరియా అన్నారు. ప్రభుత్వ చర్యల వల్ల ఏపీలో కేసులు తగ్గుముఖం పట్టాయని చెప్పారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "ఎస్‌వోపీ పాటించడంపైనే థర్డ్‌వేవ్ ఆధారపడి ఉంటుంది. పిల్లలపై థర్డ్‌వేవ్ ప్రభావం చూపుతుందనడానికి ఆధారాలు లేవు. ఇప్పటికే చాలామంది పిల్లలు వైరస్ బారినపడి రికవరీ అయ్యారు. కోవిడ్‌ను ఎదుర్కోవడానికి మాస్క్, టీకా తప్ప మరో మార్గం లేదు" అని అన్నారు.

## పంద్రాగస్టు వేడుకల ఏర్పాట్లు పరిశీలించిన డీజీపీ గౌతమ్ సవాంగ్



విజయవాడ: 75వ స్వాత్రంత్య వేడుకలకు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ముస్తాబవుతోంది. పంద్రాగస్టు వేడుకల ఏర్పాట్లను డీజీపీ గౌతమ్ సవాంగ్, సీపీ బత్తిన శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ నివాస్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీజీపీ మీడియాతో మాట్లాడుతూ, వేడుకలకు వీవీఐపీ, వీఐపీలతో పాటు కొందరికే అనుమతి ఉంటుందని, మూడంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నామన్నారు. కరోనా నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పాస్‌లు ఉన్నవారికే వేడుకలు వీక్షించేందుకు అనుమతి ఉంటుందని డీజీపీ గౌతమ్ సవాంగ్ వెల్లడించారు.

## అన్ని మౌలిక వసతులతో టిడ్కో ఇళ్లు

### ఏడాదిన్నర లోగా లబ్ధిదారులకు అందచేత

### వచ్చే ఆరు నెలలో 80 వేల ఇళ్లు

### టిడ్కో ఛైర్మన్ గా ప్రసన్న కుమార్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పురపాలక శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



విజయవాడ, ఆగస్టు 14,టిడ్కో నెలకొల్పిన చాలా కాలం తరువాత, పూర్తి స్థాయి ఛైర్మన్ గా నియమితులైన ప్రసన్నకుమార్ ను పురపాలక శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అభినందించారు. విజయవాడలోని టిడ్కో కార్యాలయంలో శనివారం సహచర మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులతో కలిసి ప్రసన్నకుమార్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో మంత్రి బొత్స సత్యనారాయణ పాల్గొని ప్రసగించారు. మంత్రి మాట్లాడుతూ సాంకేతిక పరంగా విద్యావంతుడైన , డిపార్ట్ మెంట్ లో ఇంజనీర్ గా పని చేసిన వ్యక్తి టిడ్కోకు ఛైర్మన్ గా నియమితులు కావడం హర్షణీయం. అధునాత టెక్నాలజీని ఉపయోగించుకుని, ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలన్న సంకల్పంతో టిడ్కోను నెలకొల్పినప్పటికీ, గత ప్రభుత్వంలోని అవకతవకల వల్ల దానిని సాధించలేకపోయారు. గౌరవనీయ వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారి నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేదలందరికీ ఇళ్లను అందించాలన్న సంకల్పంతో కీలకమైన నిర్ణయాలు తీసుకుని పనులను వేగవంతం చేస్తున్నాము. బలహీన వర్గాల వారికి లబ్ధి చేకూరాలని సీఎం జగన్ మోహన్ రెడ్డి పలు నిర్ణయాలు తీసుకున్నారు. పేదలకు లబ్ధి చేకూరేలా 300 చదరపు అడుగుల ఇళ్ళను ఒక్క రూపాయికే అందచేస్తున్నాము. అంతే కాకుండా మిగిలిన లబ్ధిదారులు కట్టాల్సిన లక్ష రూపాయలు, 50 వేలను కూడా సగానికి తగ్గిస్తూ మేలు చేకూర్చాము. ఇటీవల ముఖ్యమంత్రి గారి వద్ద జరిగిన సమిక్షా సమావేశంలో వచ్చే ఏడాదిన్నర కాలంలో లబ్ధిదారులందరికీ ఇళ్లను అందచేయాలని నిర్ణయించి, అందుకు అనుగుణమైన కార్యాచరణతో పనులను వేగవంతం చేయాలని కార్యాచరణ రూపొందించాము. వచ్చే 6 నెలల కాలంలో సుమారు 80 వేల ఇళ్లను, ఆ పై 6 నెలల్లో మరో 80 వేల ఇళ్ళు, మిగిలిన వాటిని తదుపరి ఆరు నెలల కాలంలో ఇలా మొత్తం 18 నెలల కాలంలో అన్ని మౌలిక వసతులతో టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందచేసేలా పనులు చేపట్టాము. ఈ నేపథ్యంలో టిడ్కో ఛైర్మన్ గా నియమితులైన ప్రసన్న కుమార్ ముఖ్యమంత్రిగారి లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తూ, నిర్దేశించిన సమయంలో ఇళ్లన్నటిని పూర్తి చేయించడంలో సఫలీకృతమై ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

## టీడీపీ పాలనంతా గ్రాఫిక్స్‌తో మాయ: మంత్రి ఆదిమూలపు




పి.గన్నవరం: పేద విద్యార్థులు అందరికీ మెరుగైన విద్య అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏటా విద్యారంగానికి రూ.30 వేల కోట్లు కేటాయిస్తున్నారని విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ తెలిపారు. నాడు నేడు మొదటి విడత కార్యక్రమంలో రూ.3,600 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని 15,715 పాఠశాలల రూపురేఖలను మార్చివేశామని వివరించారు. పి గన్నవరం ఉన్నత పాఠశాల నుంచి సీఎం జగన్ ప్రజలకు అంకితం చేయనున్నారని ప్రకటించారు. ఈనెల 16వ తేదీన సీఎం జగన్ తూర్పుగోదావరి జిల్లా పి. గన్నవరంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక హైస్కూల్‌లో శనివారం అభివృద్ధి పనులు, సభ ప్రాంగణాన్ని మంత్రి సురేశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వం గ్రాఫిక్స్‌తో మాయ చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని వ్యాపారంగా మార్చి కార్పొరేట్ కబంధ హస్తాలు అందించిందని ఆరోపించారు. ఇక రెండో విడతగా రూ.4,800 కోట్ల వ్యయంతో మరో 16 వేల ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. జగనన్న విద్యా కానుక కార్యక్రమం కింద గతేడాది రూ. 650 కోట్లతో 42 లక్షల మంది విద్యార్థులకు విద్యా కానుక కిట్స్ అందించినట్లు గుర్తుచేశారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోవడనీతో కొత్తగా ఆరు లక్షల మంది విద్యార్థులు చేరారని పేర్కొన్నారు. వారందరికీ రూ.800 కోట్ల విలువైన జగనన్న కిట్లు పంపిణీ చేస్తామని తెలిపారు.


## జగన్‌ను సూటిగా ప్రశ్నించిన అచ్చెన్నాయుడు



విజయవాడ: సీఎం జగన్‌ను టీడీపీ నేత అచ్చెన్నాయుడు సూటిగా ప్రశ్నించారు. అప్పుల ద్వారా తెచ్చిన సొమ్ము ఏమైందని నిలదీశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లు, సబ్ ప్లాన్ దుర్వినియోగం చేస్తున్నారని, స్కీముల పేరుతో స్కాములు చేస్తూ ప్రజా సంపద దోచేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. రాష్ట్రం లూటీకి, దుబారాకు బలైంది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. పన్నుల పెంపుతో ప్రజలపై రూ.75వేల కోట్లు అదనపు భారం మోపారని మండిపడ్డారు. 2019-21 మధ్య రూ.2,00,139 కోట్ల అప్పులు చేశారని ఆయన పేర్కొన్నారు. ఇళ్ల పట్టాల పేరుతో రూ.6,500 కోట్లు లూటీ చేశారని, ప్రజలతో పిచ్చి మద్యం తాగిస్తూ ఏటా రూ.6వేల కోట్ల లూటీ చేస్తున్నారని దుయ్యబట్టారు. రెండేళ్లలో రూ.4లక్షల కోట్లకు పైగా బడ్జెట్ ఖర్చు చేశారని అచ్చెన్నాయుడు విమర్శించారు.

### అవసరమైతే మళ్లీ విచారణకు పిలుస్తాం: సీఐడీ

గుంటూరు: సీఐడీ కార్యాలయం నుంచి చేరెడ్డి జనార్ధన్ బయటకు వచ్చారు. బుడంపాడుకు చెందిన జనార్దన్‌ను సీఐడీ అదుపులోకి తీసుకుంది. సీఎంకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినందుకు విచారించారు. ఐపీసీ 41ఏ సెక్షన్ కింద జనార్ధన్ పై సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. జనార్ధన్ ఫోన్ సీఐడీ అధికారులు సీజ్ చేశారు. అవసరమైతే మళ్లీ విచారణకు పిలుస్తామని సీఐడీ తెలిపింది.




## విభజన బాధలను ఎన్నటికీ మరిచిపోలేం: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ఆగస్టు 14వ తేదీని ఇక నుంచి విభజన స్మృతి దినంగా గుర్తించనున్నట్లు ప్రధాని మోదీ ఇవాళ ప్రకటించారు. తన ట్విట్టర్ అకౌంట్ ద్వారా ఆయన ఈ విషయాన్ని తెలిపారు. దేశ విభజన వల్ల కలిగిన బాధలను ఎన్నటికీ మరిచిపోలేమని ప్రధాని చెప్పారు. లక్షలాది మంది మన సోదరసోదరీమణులు చెల్లాచెదురయ్యారని, మతిలేని ద్వేషం, హింస వల్ల వేలాది మంది మరణించారని, వారి కష్టాలు, త్యాగాలకు గుర్తుగా ఆగస్టు 14వ తేదీన విభజన భయానక స్మృతి దినంగా పాటించనున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. దేశ విభజన వల్ల ప్రజల్లో సామాజిక విభజనలు వచ్చాయని, సామరస్యం లోపించిందని, ఆ విష బీజాలను పారద్రోలేందుకు



పార్టిషన్ హారర్స్ రిమెంబ్రెన్స్ డే నిర్వహించాలని మోదీ తెలిపారు. ఈ స్మృతి దినం ఏకత్వ స్ఫూర్తిని నింపాలన్నారు. సామాజిక సామరస్యం, మానవ సాధికారత మరింత బలోపేతం కావాలని మోదీ తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన సీఎం జగన్

### భీమవరంలో సీఎం వైఎస్ జగన్ పర్యటన

### ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కుమార్తె వివాహానికి హాజరైన సీఎం

పశ్చిమగోదావరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో పర్యటించారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కుమార్తె వివాహానికి సీఎం హాజరయ్యారు. నూతన వధూవరులను సీఎం వైఎస్ జగన్ ఆశీర్వదించారు. వివాహ వేడుకల్లో మంత్రి శ్రీరంగనాథ రాజు, టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ కె శ్రీధర్, ఎమ్మెల్యేలు దూలం నాగేశ్వరరావు, ప్రసాదరాజు,



అబ్బయ్య చౌదరి, కలెక్టర్ కార్తికేయ మిశ్రా పాల్గొన్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## భద్రతా దళాలను బలోపేతం చేయడమే లక్ష్యం: అష్రఫ్ ఘనీ

కాబూల్ : తాలిబన్ల ఆక్రమణతో ఆఫ్ఘనిస్తాన్ ఉక్కిరిబిక్కిరవుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ రాజీనామా చేసి తన కుటుంబంతో కలిసి దేశం విడిచి వెళ్లనున్నట్లు వార్తలు వ్యాపించాయి. అయితే ఆ వార్తలకు భిన్నంగా ఇవాళ ఘనీ జాతిని ఉద్దేశించి మాట్లాడారు. దేశ భద్రతా దళాలను పునరుత్తేజం చేయడమే తన లక్ష్యమని ఆయన అన్నారు. ఓ వీడియో ద్వారా సందేశం ఇచ్చిన ఘనీ.. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో సెక్యూర్టీ, రక్షణ దళాలను బలోపేతం చేయాలని, ఆ దిశగా చాలా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. అస్థిరతను ఆపేస్తామన్నారు. అమెరికా సేనలు ఉపసంహరణ తర్వాత ఆఫ్ఘనిస్తాన్‌లో మళ్లీ తాలిబన్లు రెచ్చిపోతున్నారు. ఒక్కొక్క నగరాన్ని తమ హస్తగతం చేసుకుంటున్నారు. ఇప్పటికే ఆ దేశంలో రెండవ అతిపెద్ద పట్టణమైన కాందహార్ .. తాలిబన్ల వశమైంది. ప్రస్తుతం తాలిబన్ ఫైటర్.. కాబూల్ సరిహద్దుల్లో పాగా వేసినట్లు తెలుస్తోంది. త్వరలోనే వాళ్లు రాజధాని



కాబూల్‌ను కూడా స్వాధీనం చేసుకోనున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరో వైపు ఆ నగరంలో ఉన్న విదేశీ కార్యాలయాలను మూసివేస్తున్నారు. వాటిల్లో పనిచేసే సిబ్బందిని ఆయా దేశాలకు తరలిస్తున్నారు.

# సంపాదకీయం

ఆదివారం 15 ఆగస్టు 2021

## ఆఫ్ఘన్ లో మళ్లీ రక్తపాతం


ఆఫ్ఘనిస్థాన్ మరోసారి రగులుతోంది. రెండు దశాబ్దాల పాటు అమెరికా సేనలు అక్కడే తిష్ట వేయడంతో గాడిన పడిన ఆ దేశం.. ఇప్పుడు అగ్రరాజ్య దళాలు వెనుదిరుగుతుండటంతో మరోసారి రాక్షస తాలిబన్ల చేతుల్లోకి వెళ్లిపోతోంది. ఆఫ్ఘన్ సాయుధ దళాలపై పైచేయి సాధిస్తూ.. మారణహోమం సృష్టిస్తూ.. మెల్లగా ఆ దేశంలోని ఒక్కో కీలక ప్రాంతాన్ని మరోసారి తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. ఇప్పటికే దేశంలోని రెండో అతిపెద్ద నగరమైన కాందహార్ వాళ్ల చేతుల్లోకి వెళ్లిపోయింది. ఇప్పుడు రాజధాని కాబూల్ కూడా అతి త్వరలోనే వాళ్ల వశమయ్యే అవకాశం ఉండటంతో అక్కడి ప్రభుత్వం.. అధికారాన్ని పంచుకుందామంటూ తాలిబన్లకు రాయబారం పంపింది. ఈ నేపథ్యంలో అసలు ఆఫ్ఘనిస్థాన్‌లో ఏం జరుగుతోంది? ఎవరీ తాలిబన్లు? ఈ స్థాయికి ఎలా వచ్చారన్నది ఓసారి చూద్దాం. 1989లో పష్తూన్ తెగకు చెందిన ముల్లా మొహమ్మద్ ఒమర్ దక్షిణ ఆఫ్ఘనిస్థాన్‌లో ఈ తాలిబన్ గ్రూప్‌ను ప్రారంభించాడు. ముజాహిదీన్ కమాండర్‌గా మారిన అతడు.. ఆ ఏడాది సోవియట్లను దేశం నుంచి తరిమివేయడంలో కీలకంగా వ్యవహరించాడు. ఆ తర్వాత ఆఫ్ఘనిస్థాన్‌లో మొదలైన సివిల్ వార్‌తో ఈ తాలిబన్లు బలపడ్డారు. 1994లో కాందహార్ చేరిన ముల్లా.. 50 మంది అనుచరులతో ఓ గ్రూప్ ఏర్పాటు చేశాడు. అక్కడి నుంచి తన సంస్థను బలోపేతం చేసుకుంటూ వెళ్లిన ముల్లా.. రెండేళ్లలోనే కాందహార్‌తోపాటు రాజధాని కాబూల్‌ను కూడా తమ ఆధీనంలోకి తీసుకున్నారు.రాజకీయ అస్థిరత, ప్రజల్లో నెలకొన్న భయాన్ని ఆసరాగా చేసుకొని తాలిబన్లు చాలా వేగంగా దేశం మొత్తం విస్తరించారు. అప్పటి నుంచీ దేశంలో కఠినమైన ఇస్లామిక్ నిబంధనలను అమలు చేశారు. టీవీలు, మ్యూజిక్ బంద్ చేశారు. బాలికలను స్కూళ్లకు వెళ్లకుండా అడ్డుకున్నారు. అమెరికాలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై దాడిలో ప్రధాన సూత్రధారి అయిన ఒసామా బిన్ లాడెన్‌కు ఈ తాలిబన్లే ఆశ్రయం కల్పించారు. అతన్ని తమకు అప్పగించాల్సిందిగా అమెరికా డిమాండ్ చేసినా తాలిబన్లు వినకపోవడంతో.. ఇక అగ్రరాజ్య దళాలు ఆ దేశంలో అడుగుపెట్టాయి. దీంతో ముల్లా ఒమర్, మిగతా తాలిబన్ లీడర్లు ఆఫ్ఘన్ నుంచి పారిపోయి పాకిస్థాన్‌లో తలదాచుకున్నారు. 2001 నుంచి ఇప్పటి వరకూ అమెరికా దళాలు ఆఫ్ఘనిస్థాన్‌లోనే ఉన్నాయి.గతేడాది ఫిబ్రవరిలో అమెరికా, తాలిబన్ల మధ్య ఓ చారిత్రక ఒప్పందం కుదిరింది. వచ్చే 14 నెలల్లో ఆఫ్ఘనిస్థాన్ నుంచి అమెరికా దళాలు పూర్తిగా వెనక్కి వెళ్లాలని ఈ ఒప్పందంలో భాగంగా నిర్ణయించారు. పాశ్చాత్య దేశాలకు ముప్పుగా పరిణమించే ఉగ్రవాదులు ఆఫ్ఘన్ భూభాగంపై లేకుండా చూసుకుంటామని తాలిబన్లు అమెరికాకు హామీ ఇచ్చారు. అయితే ఈ మధ్యలో తాలిబన్, ఆఫ్ఘన్ ప్రభుత్వం మధ్య జరిగిన చర్చలు విఫలమవుతూ వచ్చాయి. ఈ ఒప్పందం ప్రకారం ఇప్పుడు అమెరికా దశల వారీగా తమ బలగాలను వెనక్కి రప్పిస్తోందిదీంతో ఆఫ్ఘనిస్థాన్‌లో మరోసారి రాజ్యాంగాధికారం కోసం తాలిబన్లు దాడులకు తెగబడుతున్నారు. అమెరికా బలగాల మద్దతు లేకపోవడంతో ఆఫ్ఘన్ సేనలు వారికి ఎదురు నిలవలేకపోతున్నాయి. అమెరికాకు ఇచ్చిన హామీని తాలిబన్లు తుంగలో తొక్కుతున్నారు. శాంతియుతంగా ప్రభుత్వంతో చర్చలు జరుపుతామన్న హామీని కూడా తాలిబన్లు పట్టించుకోవడం లేదు.ఆఫ్ఘనిస్థాన్‌లో అమెరికా రెండు దశాబ్దాల పాటు యుద్ధం చేసింది. ఈ యుద్ధంలో అమెరికా సంకీర్ణ దళాలతోపాటు తాలిబన్లు, ఆఫ్ఘన్ పౌరులు పెద్ద ఎత్తున ప్రాణాలు కోల్పోయారు. బ్రౌన్ యూనివర్సిటీ చేసిన అధ్యయనం ప్రకారం.. ఆఫ్ఘన్ సాయుధ దళాల్లో 69 వేల మంది మృత్యువాత పడ్డారు. ఇక ఆఫ్ఘన్ పౌరులు 51 వేల మంది, మిలిటెంట్లు మరో 51 వేల మంది ఈ సుదీర్ఘ యుద్ధంలో మరణించారు. ఇక 2001 నుంచి 3500 మంది అమెరికా సంకీర్ణ దళాలకు చెందిన సైనికులు చనిపోయారు. వీళ్లలో మూడింట రెండో వంతు అమెరికా సైనికులే. 20 వేల మందికిపైగా అమెరికా సైనికులు గాయపడ్డారు.ఈ యుద్ధం కారణంగా ఆఫ్ఘనిస్థాన్‌లో కుటుంబాలు చెల్లాచెదురయ్యాయి. 2012 నుంచి సుమారు 50 లక్షల మంది దేశాన్ని వదిలి వెళ్లారు. వీళ్లలో చాలా మంది మళ్లీ స్వదేశానికి తిరిగి రాలేదు. వివిధ దేశాల్లో తలదాచుకుంటున్నారు. అంతేకాదు ఆఫ్ఘన్ యుద్ధంపై అమెరికా భారీగా ఖర్చు చేసింది. అక్కడి మిలిటరీతోపాటు ఆఫ్ఘన్ పునర్నిర్మాణానికి ఈ 20 ఏళ్లలో సుమారు లక్ష కోట్ల డాలర్లు అమెరికా ఖర్చు చేయడం గమనార్హం. ఇంతా చేసి ఇప్పుడు అమెరికా దళాలు దేశాన్ని వదిలి వెళ్తుండటంతో ఆఫ్ఘనిస్థాన్ మరోసారి రాక్షస మూకల చేతుల్లోకి వెళ్లిపోతోంది. తాలిబన్ అనే పదం తాలిబ్ అనే అరబిక్ పదం నుంచి వచ్చింది. తాలిబ్ అంటే విద్యార్థి అని అర్థం. పాకిస్థాన్‌కు చెందిన మతపరమైన స్కూలు విద్యార్థులు దీనిని స్థాపించారు కాబట్టి ఈ మిలిటెంట్ గ్రూప్‌కు తాలిబన్లు అనే పేరు వచ్చింది. 2021 నాటికి తాలిబన్లలో మొత్తం 75 వేల మంది ఫైటర్లు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. వీళ్లు తమకు తాము ఇస్లామిక్ ఎమిరేట్స్ ఆఫ్ ఆఫ్ఘనిస్థాన్‌గా చెప్పుకుంటారు.ఇప్పటికే ఆఫ్ఘనిస్థాన్‌లో మూడింట రెండొంతుల ప్రాంతం తాలిబన్ల చేతుల్లోకి వెళ్లిపోయింది. రెండో అతిపెద్ద నగరం కాందహార్‌ను కూడా వాళ్లు ఆక్రమించేశారు. ఇక మొత్తం దేశం వాళ్ల ఆధీనంలోకి వెళ్లిపోతుందా అన్నదే ఇప్పుడు ప్రశ్న. త్వరలోనే కాబూల్‌ను ఆక్రమించుకుంటామని తాలిబన్లు చెబుతున్నారు. అక్కడి ప్రభుత్వాన్ని కూలదోయరన్న నమ్మకం తనకు ఉందని అమెరికా అధ్యక్షుడు బైడెన్ చెప్పడం గమనార్హం. అమెరికా దళాలను వెనక్కి రప్పించడాన్ని ఆపబోమని ఆయన స్పష్టం చేశారు. అమెరికా ఎంబసీ, కాబూల్ ఎయిర్‌పోర్ట్, ఇతర కీలకమైన ప్రభుత్వ స్థావరాల భద్రత కోసం మాత్రం 650 నుంచి 1000 మంది బలగాలను అక్కడే ఉంచుతామని మాత్రం బైడెన్ చెప్పారు.

# మిల్క్ మ్యాన్ ల మధ్య పోటీ

### ధూళిపాళ్ల వర్సెస్ బొల్లా

గుంటూరు, ఆగస్టు 14, (న్యూస్ పల్స్)గుంటూరు జిల్లాలో ప్రముఖ పాల వ్యాపారులుగా గుర్తింపు పొందిన వైసీపీ నాయకుడు, ప్రస్తుత ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడుకు, టీడీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌కు మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. ఇరువురు నేతలు ఒకరిపై ఒకరు విరుచుకుపడుతున్నారు. మాటల తూటాలు పేల్చుకుంటున్నారు. నువ్వు.. అవినీతి పరుడవంటే.. నువ్వే అవినీతి పరుడవంటూ.. పెద్ద ఎత్తున విమర్శలు చేసుకుంటున్నారు. మరి దీనికి రీజనేంటి? అనేది ఆసక్తిగా మారింది. వాస్తవానికి ఇద్దరూ పాల వ్యాపారులే అయినా.. ఏనాడూ వ్యాపార పరంగా ఇరువురు మధ్య విభేదాలు చోటు చేసుకోలేదు.అదే సమయంలో రాజకీయాల్లో ఉన్నప్పటికీ.. ఇద్దరివీ వేర్వేరు నియోజకవర్గాలు కావడంతో .. రాజకీయంగా కూడా ఇద్దరి మధ్య శత్రుత్వం లేదు. అయినా కూడా ఇద్దరూ ఇప్పుడు.. మాటల దాడులు చేసుకుంటూ.. ఒకరినొకరు విమర్శించుకుంటున్నారు. బొల్లా బ్రహ్మానాయుడు 'తిరుమల' బ్రాండ్ పేరుతో పాల వ్యాపారం చేయగా దానిని అమ్మేశారు. ఇక ఇప్పుడు ఆయన వల్లభ బ్రాండ్‌కు అధినేతగా ఉన్నారు. ఇక, తన తండ్రి వారసత్వంగా వచ్చిన సంగం డెయిరీకి చైర్మన్‌గా ధూళిపాళ్ల కొనసాగుతున్నారు. అయితే.. ఇటీవల ప్రభుత్వం తీసుకువచ్చిన అమూల్ నేపథ్యంలో ధూళిపాళ్లకు చెందిన సంగం డెయిరీపై ప్రభుత్వం కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.దీంతో నరేంద్ర కొన్నిరోజులు జైల్లో కూడా గడపాల్సి వచ్చింది. ఈ క్రమంలో ప్రభుత్వం తనను కావాలనే జైలుకు పంపిందని.. రాజకీయ కుట్ర ఉందని.. నరేంద్ర ఆరోపిస్తున్నారు. తన డైయిరీకి సంబంధించిన అన్ని లావాదేవీలు సజావుగానే ఉన్నాయని.. ఎక్కడా అవినీతికి పాల్పడలేదనేది ఆయన వాదన. అయితే.. ప్రభుత్వం మాత్రం కంపెనీ యాక్టు మేరకు సంగం డెయిరీ నడవడం లేదని పేర్కొంటూ.. నరేంద్రపై చర్యలకు దిగింది. ఈ వివాదానికి.. బొల్లా బ్రహ్మానాయుడుకు ఎలాంటి సంబంధం లేదు. ప్రభుత్వం వర్సెస్ ధూళిపాళ్ల మధ్య జరుగుతున్న వివాదంలో బొల్లా బ్రహ్మానాయుడు వేలు పెట్టారు.నరేంద్ర కుమార్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. సహకారపరిధిలో ఉన్న డెయిరీని కంపెనీ చట్టంలోకి మార్చుకుని డబ్బులు దోచుకుంటున్నారని బొల్లా బ్రహ్మానాయుడు ఆరోపించారు. సంగంకు నరేంద్ర ఛైర్మెన్ గా ఉంటూ ధూళ్లిపాళ్ల ట్రస్టుకు తన భార్యను ఛైర్మెన్ గా ఉంచారని, రైతుల సొమ్మును ట్రస్టుకు దారి మళ్లించి అవినీతికి పాల్పడుతున్నారని బొల్లా బ్రహ్మానాయుడువ్యాఖ్యానించారు. పాల ఉత్పత్తిదారుల సొమ్ములను ధూళ్లిపాళ్ల ట్రస్టులోకి ఎలా మళ్లిస్తారని బొల్లా ప్రశ్నిస్తున్నారు. నరేంద్రకు నిజాయితీ ఉంటే సంగం డైరీని కంపెనీ చట్టం నుంచి సహకార సంఘం పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.దీనికి ప్రతిగా.. నరేంద్ర కూడా ఘాటుగానే కౌంటర్ ఇస్తున్నారు. ఎందుకూ పనికిరాని భూములను జగనన్న ఇళ్ల కోసం ప్రభుత్వానికి అమ్మి కోట్లు గడించారంటూ? నరేంద్ర బొల్లా బ్రహ్మానాయుడును దుయ్యబట్టారు. ఇలా.. తనకు సంబంధం లేని.. తన ప్రమేయం లేని.. వివాదంలో బొల్లా కలుగజేసుకోవడం చూస్తే.. దీనివెనుక వైసీపీ వ్యూహం ఏదైనా ఉందనే అంటున్నారు. కమ్మ వర్గానికి చెందిన నరేంద్రను అదే కమ్మ వర్గానికి చెందిన బొల్లా బ్రహ్మానాయుడుతో టార్గెట్ చేయిస్తున్నారు. పైగా ఇద్దరూ పాల వ్యాపారంలోనే ఉన్నారు. ఇది కూడా నరేంద్రను బొల్లాతో టార్గెట్ చేయించడానికి మరో కారణం.

# కమలానికి పూర్వ వైభవం కోసం కష్టాలు



విజయవాడ, ఆగస్టు 14, (న్యూస్ పల్స్)భారతీయ జనతా పార్టీ కి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాలుగు స్థానాలు ఏ పార్టీతో పొత్తు లేకుండా గెలుచుకున్న రోజులవి. 1998 లో దేశవ్యాప్తంగా వీచిన అటల్ బిహారీ వాజ్ పేయి గాలి లో తూర్పుగోదావరి జిల్లాలోని రాజమండ్రి, కాకినాడ, కరీంనగర్, సికింద్రాబాద్ లోక్ సభ స్థానాల్లో జయకేతనం ఎగురవేసి రాజకీయ విశ్లేషకులకు సైతం షాక్ ఇచ్చేసింది కమలం. రాజమండ్రి నుంచి గిరజాల వెంకటస్వామి నాయుడు, కాకినాడ నుంచి సినీ నటుడు కృష్ణం రాజు, సికింద్రాబాద్ నుంచి బండారు దత్తాత్రేయ, కరీంనగర్ నుంచి చెన్నమనేని విద్యాసాగర్ రావు లు నాడు విజేతలు అయి దేశవ్యాప్త చర్చలో చరిత్రకెక్కిన వారు. దాంతో వాజ్ పేయి ప్రభంజనం ముందే గ్రహించిన చాణుక్యుడు చంద్రబాబు బీజేపీ తో దోస్తీ కట్టి ఆ పార్టీ జోరుకు బ్రేక్ లు వేసేసారు. నాడు ఉమ్మడి ఎపి లో రాజమండ్రి, నర్సాపురం, తిరుపతి, సికింద్రాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్ లు గెలుచుకుంది బిజెపి.కట్ చేస్తే ఆ తరువాత 2004 లో మోడీ గోద్రా అల్లర్ల కారణంగా బీజేపీ తో పొత్తు ఉంటే తమపార్టీ కి మైనారిటీ ఓటు బ్యాంక్ దూరం అవుతుందన్న అంచనా తో టిడిపి అధినేత వారితో జట్టు పీస్ కొట్టేశారు. తిరిగి 2014 లో మోడీ ప్రభంజనం గతంలో లాగే అంచనా వేసిన చంద్రబాబు మళ్ళీ అద్భుతమైన వ్యూహంతో కమలంతో బాటు జనసేన తో పొత్తు కలిపి అధికారం అందుకున్నారు. అయితే ఈ పొత్తులో విశాఖ లో కంభంపాటి హరిబాబు, నర్సాపురం నుంచి గోకవరపు గంగరాజు, సికింద్రాబాద్ నుంచి బండారు దత్తాత్రేయ మాత్రమే గెలిచారు. టిడిపి పొత్తులో బీజేపీకి ఇచ్చిన సీట్లలో చాలాచోట్ల ఓట్ల బదిలీ సైకిల్ పార్టీనుంచి లేకుండా ఆ పార్టీ తెలుగు రాష్ట్రాల్లో పాతుకుపోకుండా వ్యూహాత్మకంగా సీట్లను తగ్గించే వ్యూహం విజయవంతంగా అమలు చేసింది. ఇందులో పురంధరేశ్వరి వంటివారు రాజంపేట లో ఓటమి చెందడానికి టిడిపి అమలు చేసిన వ్యూహమే కారణమన్నది నాడు పెద్ద ఎత్తునే చర్చ సాగింది.ఇదిలా ఉంటే 2019 లో మోడీ వేవ్ ను తక్కువ అంచనా వేసి ప్రత్యేక హోదా సెంటిమెంట్ పేరుతో బీజేపీ పై వ్యతిరేకత ప్రజల్లో ఉందన్న తప్పుడు లెక్కలతో చంద్రబాబు బొక్కబోర్లా పడిపోయారు. ఎన్డీయే నుంచి బయటకు వచ్చేసి మరీ మోడీ పై ధర్మ పోరాటం పేరుతో ఆయన ఇమేజ్ ను ఎంత డ్యామేజ్ చేయాలో అంతా చేశారు చంద్రబాబు. ఆయన వేసుకున్న సెల్ఫ్ గోల్ తో ఎవరినైతే తాను అధికారంలోకి రాకుండా ఉండాలని కోరుకున్నారో వైఎస్ తనయుడు అఖండ మెజారిటీ తో ముఖ్యమంత్రి అయ్యేందుకు 22 ఎంపి సీట్లతో సహా ఇచ్చుకునే పరిస్థితి కొనితెచ్చు కున్నారు. ఇలాంటి దశలో మరోసారి బీజేపీ తో పొత్తు లేకపోతే జగన్ సంక్షేమ పథకాల ఫ్యాన్ గాలిలో కొట్టుకుపోతారేమోననే భయంతో ఆందోళన చెందుతున్నారు.ఈ లెక్కలన్నీ సరిచూసుకుని చంద్రబాబు 2024 ఎన్నికల వరకు ఆగే పరిస్థితి లేకుండా ముందుకు వచ్చేశారు. సాక్షాత్తు మహానాడు లో బీజేపీకి తమ మద్దతంటూ స్నేహ హస్తం చాచేయడం గమనిస్తే చంద్రబాబు అభద్రతా భావం ప్రస్ఫుటం అయిపోతుంది. అయితే గత అనుభవాల రీత్యా టిడిపి తో పొత్తు భవిష్యత్తులో సొంత కాళ్లపై నిలబడాలనుకుంటున్న ప్రతీసారి వెనక్కి లాగుతుందన్న అంచనా ఉండటంతో కమలం అధికార వైసిపి, విపక్ష టిడిపి లకు సమాన దూరం అనే సిద్ధాంతం తో వ్యూహాత్మకంగా ముందడుగులు వేస్తుంది. అయితే గతంలో ఏ పార్టీతో పొత్తు లేకుండా నాలుగు ఎంపి స్థానాలు మరోసారి టిడిపి తో పొత్తుతో ఏడు పార్లమెంట్ సీట్లు గెలుచుకున్న బీజేపీ ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో మెరుగైన పరిస్థితి ముఖ్యంగా విభజిత ఆంధ్రప్రదేశ్ లో సాధిస్తుందా అన్నది ప్రశ్నర్థకం గా మిగిలింది.తెలంగాణ లో గత ఎన్నికల్లో నాలుగు ఎంపీ స్థానాలు గెలవడంతో ఇక ఆ రాష్ట్రం పైనే తన ఫోకస్ పెంచింది కమలం. ఇక ఎపి లో గతంలో పొత్తులు లేకుండా, పొత్తులతో గెలిచిన పార్లమెంట్ స్థానాలను తిరిగి గెలిచేందుకు సీరియస్ గా ప్రయత్నం చేస్తుందా లేదా ? అదీ జనసేన వంటి తనకన్నా ప్రస్తుతం మెరుగైన ఓటు బ్యాంక్ కలిగిన వారితో ఉండి కూడా లక్ష్యం నెరవేర్చుకోవడానికి ఎలాంటి ఎత్తులతో ముందుకు సాగుతుందో చూడాలి. అయితే స్టీల్ ప్లాంట్ ప్రవేటీకరణ, ప్రత్యేక హోదా, రైల్వే జోన్, పోర్ట్ లు వంటి అంశాల్లో కేంద్రం అనుసరిస్తున్న వైఖరే ఏపీ బీజేపీ ఎదుగుదలకు ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న మిగిలిన వారికి ఫలితం లేకుండా పోతుందన్న ఆందోళన ఎపి లో ఆ రెండు పార్టీల్లో ఉంది. ఇలాంటి నేపథ్యంలో కూడా గతిలేని పరిస్థితుల్లో బీజేపీ తో దోస్తీకి టిడిపి సిద్ధం కావడం మరింత చర్చనీయం గా మారిపోయింది. రాజకీయ సమీకరణాలు కొన్ని అనుకులిస్తున్నా కమలం రాబోయే రోజుల్లో పుంజుకోవడం ఆషామాషీ కాదు. తెలంగాణ బీజేపీకి కేంద్రం లోని అధిష్టానం సహకరిస్తున్న రీతిలో ఎపి లో సాయం అందించకపోవడంతో ఆ పార్టీ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంటుందా అనే ప్రశ్నకు కాలమే ఆ పార్టీ భవిష్యత్తు వచ్చే ఎన్నికల్లో

# ఈసారి వాళ్లిద్దరికి అమాత్యులుగా అవకాశం..

కడప, ఆగస్టు 14, (న్యూస్ పల్స్)ఇది చాలా విచిత్రమైన రాజకీయం.. వారిద్దరు బెస్ట్ ఫ్రెండ్స్.. ఏపీ సీఎం జగన్ సొంత జిల్లాకు చెందిన వైసీపీ సీనియర్ నేతలు. వారు ఒక్కొక్కరు ఏకంగా నాలుగు సార్లు ఎమ్మెల్యేలు అయ్యారు. పైగా జగన్ సోనియాగాంధీని కలిసి బయటకు వచ్చి కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నానని చెప్పినప్పుడు పక్కన వారిద్దరే ఉన్నారు. క్షణం ఆలోచించకుండా వారు వెంటనే జగన్‌తో పాటు తమ ఎమ్మెల్యే పదవులు వదులుకుని? కాంగ్రెస్ నుంచి జగన్‌తో పాటే బయటకు వచ్చేశారు. ఉప ఎన్నికల్లో వైసీపీ నుంచి భారీ మెజార్టీతో గెలిచి వైసీపీ తొలి బ్యాచ్ ఎమ్మెల్యేలు అయ్యారు. గత ఎన్నికల్లో తమ తమ నియోజకవర్గాల నుంచి నాలుగోసారి గెలిచిన ఆ ఇద్దరికి మంత్రి పదవులు దక్కలేదు. ఇక త్వరలో జరిగే మంత్రి వర్గ విస్తరణలో ఇద్దరు నేతలు కూడా తమకే మంత్రి పదవులు వస్తాయని చెప్పుకుంటున్నారట. లోపల కాస్త ఆందోళనగా ఉన్నా.. పైకి మాత్రం డాంబికం పోతూ మంత్రి పదవి నాదే అని చెప్పుకుంటున్నారట. పైగా వారిద్దరి నియోజకవర్గాలు కూడా పక్కపక్కనే ఉన్నాయి.ఈ ఇద్దరు నేతలు ఎవరో కాదు.. కడప జిల్లా రైల్వేకోడూరు, రాయచోటి ఎమ్మెల్యేలు కొరుముట్ల శ్రీనివాసులు, విప్ శ్రీకాంత్ రెడ్డి. ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు జగన్‌కు ఎంతో సన్నిహితులు.. 2009లో కాంగ్రెస్ నుంచి గెలిచిన వీరు.. 2012 ఉప ఎన్నిక, 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. వీరిద్దరు కూడా మంత్రి పదవికి అర్హులే. అయితే తొలి టర్మ్‌లో అనేక సమీకరణలు వీరికి మంత్రి పదవిని దూరం చేశాయి. కొరుముట్ల ఎస్సీ ఎమ్మెల్యేల్లో సీనియర్. అయితే సీఎం సొంత జిల్లాకు చెందిన ఎమ్మెల్యే కావడం.. పైగా మైనార్టీ కోటాలో ఇదే జిల్లా నుంచి అంజాద్ బాషాకు మంత్రి పదవి రావడంతో కొరుముట్లకు మంత్రి పదవి రాలేదు.వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి వర్గం ఏర్పడడానికి రెండు రోజుల ముందు సీఎం ఆఫీస్ నుంచి ఆయనకు కాల్ కూడా వచ్చింది. పైగా ఎస్సీ వర్గం నుంచి ఐదుగురిని మంత్రులుగా తీసుకున్నా కొరుముట్లకు చివరి వరకు మంత్రి పదవి ఊరించి ఊరించి ఊసురోమనిపించింది. ఈ సారి ఈ వర్గం మంత్రుల్లో మూడు నుంచి నలుగురు అవుట్ అయ్యే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం నేపథ్యంలో కొరుముట్ల తనకు ఖచ్చితంగా మంత్రి పదవి ఖాయమనుకుంటున్నారు. ఇక రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి జగన్‌కు ఎంత సన్నిహితుడో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. శ్రీకాంత్ రెడ్డికి మంత్రి పదవి రాకపోవడానికి ఖచ్చితంగా ఆయన సామాజిక వర్గమే కారణం.అయితే వైసీపీ అధినేత జగన్ ఆయన్ను వదులుకోలేక విప్ పదవి ఇచ్చారు. ఆ తర్వాత కూడా ముఖ్యమంత్రి, శ్రీకాంత్ రెడ్డి మధ్య ఏదో గ్యాప్ ఉందన్న ప్రచారం కూడా జరిగింది. గత యేడాది కాలంగా ఆయన పెద్ద యాక్టివ్‌గా కూడా లేరు. ఈ సారి అయినా తనకు మంత్రి పదవి వస్తుందన్న ఆశ ఆయనలో ఉంది. లోపల టెన్షన్ ఉన్నా పైకి మాత్రం ప్రచారం చేసుకుంటున్నారు. ఇలా పక్క నియోజకవర్గాలకు చెందిన ఇద్దరు బెస్ట్ ఫ్రెండ్స్ అయిన ఎమ్మెల్యేల ఆశల్లో ఎవరి ఆశలు ఎలా నెరవేరతాయో ? చూడాలి. సమీకరణలు చూస్తే శ్రీకాంత్ రెడ్డి కంటే కూడా శ్రీనివాసులకే ఎక్కువ ఛాన్సులు ఉన్నట్టు తెలుస్తోంది.

## భీమవరం పేలుడు ప్రాంతాన్ని పరిశీలించిన ఎస్పీ

భీమవరంఆగస్టు 14, (న్యూస్ పల్స్)పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం లో పేలుడు సంభవించిన ప్రాంతానికి చేరుకున్న జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ శర్మ. సంఘటన స్థలాన్ని పరిశీలించి పేలుడు కు దారితీసిన కారణాలను స్వయంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ పేలుడు సంఘటన స్క్రాప్ షాప్ లోని వాషింగ్ మిషన్ 2 లోని భాగాలు కనిపించాయని అక్కడక్కడ అమ్మోనియం కనిపించిందని దీనిని క్షుణ్ణంగా పరిశీలించి డానికి విజయవాడ నుంచి ఒక టీం ని ఇస్తున్నామని వారు వచ్చే వరకు ఈ ప్రదేశం అంతా మా అధీనంలో ఉంటుందని పూర్తి వివరాలు వారు పరిశీలించిన తర్వాత వెల్లడిస్తామని తెలిపారు....

## గుడివాడలో టీడీపికి మరిన్ని కష్టాలు

విజయవాడ, ఆగస్టు 14, (న్యూస్ పల్స్)టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ జన్మించిన కృష్ణాజిల్లాలో టీడీపీ పరిస్థితి నాలుగు అడుగులు ముందుకు పదడుగులు వెనక్కి అన్న చందంగా మారిపోయింది. 2014లో ఒకింత పరిస్థితి బాగుందని అనుకున్నా.. గత ఎన్నికల విషయానికి వస్తే మాత్రం పార్టీ పూర్తిగా డీలా పడిపోయింది. మరీ ముఖ్యంగా గుడివాడ నియోజకవర్గంలో టీడీపీ ఇప్పట్లో కోలుకునే పరిస్థితి కనిపించడం లేదని అంటున్నారు. వాస్తవానికి జిల్లా మొత్తంలో.. టీడీపీ గెలవాల్సిన.. గెలిచి తీరాల్సిన నియోజకవర్గం.. గుడివాడేనని .. పార్టీలోని ప్రతి నాయకుడు.. చెబుతారు.దీనికి ప్రధాన కారణం.. టీడీపీలో రాజకీయ ఓనమాలు నేర్చుకుని.. ఎదిగిన ప్రస్తుత మంత్రి కొడాలి నాని ఇక్కడ నుంచి వరుస విజయాలు సాధిస్తున్నారు. అయితే.. ఆయన టీడీపీని విడిచి పెట్టిన తర్వాత.. పార్టీ అధినేత చంద్రబాబుపైనా.. లోకేష్‌పైనా .. ఏ విధంగా విరుచుకుపడుతున్నారో.. అందరికీ తెలిసిందే. దీనిపై టీడీపీలోనూ నేతలు ఉడికిపోతూ ఉంటారు. అయితే.. చేయాల్సింది మాత్రం చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. అంటే.. కొడాలిని ఢీకొట్టి ఆయనను ఓడించే నాయకుడిని మాత్రం టీడీపీ సిద్ధం చేసుకోలేక పోతోందనే వాదన వినిపిస్తుండడం గమనార్హం.గుడివాడ నియోజకవర్గం అంటే ఒకప్పుడు ఎన్టీఆర్.. గెలుపొందిన నియోజకవర్గంగా టీడీపీ నేతలు ఎంతో ఇష్టపడతారు. ఈక్రమంలో కొడాలి నాని ఇక్కడ నుంచి టీడీపీ తరఫున విజయం దక్కించుకున్నారు. ఆయన వైసీపీలో చేరిన తర్వాత కూడా వరుస విజయాలు దక్కించుకుంటున్నా రు. ఆయన గెలవడంపై ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ, ఎడాపెడా నోరు పారేసుకోవడంపై మాత్రం టీడీపీ నేతలు ఉడికిపోతున్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు.. ఈ నియోజకవర్గంపై కొంత మేరకు కసరత్తు జరిగింది.ఈ క్రమంలోనే విజయవాడకు చెందిన యువ నాయకుడు దేవినేని అవినాష్‌కు ఇక్కడ 2019లో టికెట్ ఇచ్చారు. అయితే.. ఆయన ఆ ఎన్నికల్లో ఓడిపోయి.. వైసీపీలో చేరిపోయారు. ఇక, ఇప్పుడు ఇక్కడ టీడీపీ ని నడిపించే నాయకులు కనిపించడం లేదు. పేరుకు మాత్రం ఇంచార్జ్ పోస్టును రావి వెంకటేశ్వ రావుకు ఇచ్చినా.. ఆయనలో కొడాలి నానిని ఢీకొట్టేంత సీన్ లేదని.. టీడీపీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. పోనీ.. నియోజకవర్గంలో అయినా.. ఉంటున్నారా? అంటే.. అది కూడా లేదు.ఆయన వ్యాపారాల్లో ఆయన బిజీగా ఉంటున్నారు. పేరుకు మాత్రమే రావి మంచినేతగా ఉంటున్నా.. ఇప్పటి రాజకీయాల్లో ఉండాల్సిన దూకుడు అయితే ఆయనలో లేకపోవడం మైనస్. ఈ పరిణామాలను సరిదిద్దక పోతే.. వచ్చే ఎన్నికలకు కూడా గుడివాడలో టీడీపీ పుంజుకునే పరిస్థితి లేదు. మొత్తానికి కొడాలి నాని ఇలాకాలో ఆయనపై పోటీ చేసే దమ్మున్న నేతే బాబుకు దొరకనంత కష్టం వచ్చేసింది

# చలమల శెట్టి సునీల్ దారేదీ

కాకినాడ, ఆగస్టు 14, (న్యూస్ పల్స్)లమలశెట్టి సునీల్.. పారిశ్రామికవేత్త అయిన ఈయన రాజకీయ కల నెరవేరలేదు. ఎన్ని పార్టీలు మారినా ఫలితం మాత్రం దక్కలేదు. మరోసారి ఆయన తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అవుతున్నారని తెలిసింది. చలమలశెట్టి సునీల్ ఇప్పటికీ తెలుగుదేశం, వైసీపీలు మారి మారి కాకినాడ పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. కానీ పార్లమెంటు సభ్యుడిగా ఎన్నిక కాలేకపోయారు.చలమలశెట్టి సునీల్ ఆర్థికంగానే కాదు సామాజికపరంగా కూడా బలమైన నేత. కాపు సామాజికవర్గానికి చెందిన చలమలశెట్టి సునీల్ కాకినాడ నుంచి ఎంపీగా గెలవాలన్న కోరిక. ప్రతి ఎన్నికలో ఆయన కోట్లు ఖర్చు పెడుతూ వస్తున్నారు. కానీ గెలుపు మాత్రం లభించడం లేదు. 2014లో వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి టీడీపీ అభ్యర్థి తోట నరసింహం చేతిలో ఓటమి పాలయ్యారు. చివరకు 2019 ఎన్నికల నాటికి టీడీపీలోకి మారి పోటీ చేసి వైసీపీ అభ్యర్థి వంగా గీత చేతిలో పరాజయం పాలయ్యారు.తర్వాత చలమలశెట్టి సునీల్ వైసీపీలో చేరారు. వైసీపీలో చేరినా ఆయన ప్రస్తుతం యాక్టివ్ గా లేరు. ఆయనకు రాజ్యసభ పదవి ఇస్తానని జగన్ హామీ ఇచ్చినట్లు కాకినాడలో ప్రచారం జరిగింది. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో మళ్లీ చలమలశెట్టి సునీల్ కు రాజ్యసభ పదవి దక్కే అవకాశం లేదంటున్నారు. రాజ్యసభ కోసం ఇప్పటికే జాబితా రెడీ అయిపోయందని, అందులో ఈయనకు అవకాశం లేదన్నది పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది.దీంతో చలమలశెట్టి సునీల్ మరోసారి 2024 ఎన్నికల్లో కాకినాడ పార్లమెంటు నుంచి పోటీ చేయాల్సి ఉంటుంది. అక్కడ ప్రస్తుత ఎంపీగా ఉన్న వంగా గీతను పెద్దాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేయించాలని జగన్ భావిస్తున్నారని టాక్. దీంతో మరోసారి చలమలశెట్టి సునీల్ వైసీ?పీ నుంచి పోటీ చేయడం గ్యారంటీఅని అంటున్నారు. ఈసారైనా ఆయన గెలిచి కలనెరవేర్చుకుంటారా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

# సొంత జిల్లాల్లో బాగుపడేది ఎప్పుడు

తిరుపతి, ఆగస్టు 14, (న్యూస్ పల్స్)చిత్తూరు జిల్లా..టీడీపీ అధినేత చంద్రబాబు సొంత జిల్లా అనే విషయం తెలిసిందే. పేరుకే చంద్రబాబుకు సొంత జిల్లా గానీ, ఇక్కడ ఆధిక్యం వైసీపీదే. గత రెండు ఎన్నికలుగా ఈ జిల్లాలో వైసీపీ హవా నడుస్తోంది. ఆ మాటకు వస్తే 1999 ఎన్నికల తర్వాత ఇక్కడ ఎప్పుడూ టీడీపీకి మెజార్టీ రాలేదు. ముఖ్యంగా చంద్రబాబు నియోజకవర్గం కుప్పం ఉన్న చిత్తూరు పార్లమెంట్‌లో వైసీపీ డామినేషన్ నడుస్తోంది. గత ఎన్నికల్లో చిత్తూరు పార్లమెంట్ పరిధిలో ఉన్న 7 అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ గెలిచింది ఒక కుప్పంలోనే. అది కూడా చంద్రబాబు సొంత సీటు.. పైగా ఆయన మెజార్టీ చాలా పడిపోయింది. చంద్రగిరి, నగరి, గంగాధరనెల్లూరు, చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు స్థానాల్లో టీడీపీ ఓడిపోయింది. సరే ఎన్నికలై రెండేళ్ళు దాటేసింది. మరి ఈ రెండేళ్ల కాలంలోనైనా ఈ అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ పుంజుకుందా? అంటే అసలు లేదనే చెప్పొచ్చు.కుప్పంలో సైతం పంచాయితీ ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయింది. కాకపోతే చంద్రబాబు ఉన్నారు కాబట్టి అక్కడ టీడీపీకి పెద్ద ఇబ్బంది ఉండదు. ఇక చంద్రగిరిలో పులివర్తి నాని ఉన్నారు. ఈయన పార్టీ తరుపున బాగానే కష్టపడుతున్నారుగానీ, అక్కడ ఉన్న వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి హవా మాత్రం తగ్గించలేకపోతున్నారు. చెవిరెడ్డి రెండు సార్లు వరుస విజయాలతో జోరు మీదే ఉన్నారు. నగరిలో టీడీపీ పుంజుకోవడానికి మంచి అవకాశం ఉంది. కానీ టీడీపీ నేత గాలి భాను ప్రకాశ్ దూకుడుగా పనిచేయడం లేదు. అందుకే అక్కడ రోజా హవానే కనిపిస్తోంది. అయితే ఇక్కడ వైసీపీ కేడర్‌లో నైరాశ్యం ఉండగా టీడీపీ కేడర్ మాత్రం మాంచి కసితో ఉంది.గంగాధర నెల్లూరులో టీడీపీ తరుపున హరికృష్ణ యాక్టివ్‌గా పనిచేయడం లేదు. పూతలపట్టులో అసలు టీడీపీ ఉందా అనే పరిస్థితికి వచ్చేసింది. పలమనేరులో మాత్రం మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి పార్టీ తరుపున గట్టిగానే కష్టపడుతున్నారు. ఈ పార్లమెంట్ పరిధిలో టీడీపీ నాయకుడు యాక్టివ్‌గా పనిచేస్తున్న నియోజకవర్గం ఇదే. అయితే ఆయన కూడా పార్టీ పుంజుకుంటుందా ? లేదా ? అన్న డౌట్‌లో ఉన్నారని పార్టీ నేతలే అంటున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో అమర్నాథ్ రెడ్డి గట్టిగా కష్టపడితే ఇక్కడ పార్టీ ఇప్పుడే ట్రాక్ ఎక్కేస్తుంది. అయితే ఆయన ఎక్కువగా బెంగళూరు వ్యాపారాల్లో బిజీగా ఉన్నారు.ఇక కీలకమైన చిత్తూరు అసెంబ్లీలో కూడా టీడీపీకి నాయకుడు లేరు. గత ఎన్నికల్లో ఓడిపోయిన ఏఎస్ మనోహర్ పార్టీని వీడారు. జిల్లా కేంద్రమైన చిత్తూరులో డీకే ఫ్యామిలీ సైడ్ అయిపోవడం పార్టీకి పెద్ద ఎదురు దెబ్బే.

## మురికి వాడలపై సమగ్ర సర్వే

విశాఖపట్టణం, ఆగస్టు 14, (న్యూస్ పల్స్)శాఖ అందమైన నగరం. ఒక వైపు ఆకాశాన్ని అంటే అతి పెద్ద అపార్ట్మెంట్స్. మరో వైపు చూస్తే పూరి గుడిసెలు. అవి కూడా సిటీ మధ్యలోనే. ఒక విధంగా చెప్పాలంటే దిష్టి చుక్కలాగానే ఉన్నాయి. ఎవరైనా స్మార్ట్ సిటీ విశాఖ అనుకుని చూసేందుకు వస్తే నగరానికి నడిబొడ్డునే మురికివాడలు కనిపిస్తూ ఇదే మా అభివృద్ధి అని వెక్కిరిస్తాయి. అవి ఈ రోజుతో పుట్టలేదు. దశాబ్దాలుగా వెలిశాయి. నగరమనే తెల్ల వస్త్రానికి అలా మురికి అంటించేస్తున్నాయి.ప్రధాని అయ్యాక పీవీ నరసింహారావు ఒకసారి విశాఖ వచ్చారు. ఆయన మురికివాడలను చూసి ఆశ్చర్యపోయారు. అలాగే కొండలెక్కిన పూరి పాకలను చూసి విస్తుబోయారు. విశాఖను అందంగా ఉండేలా చూడమని ఆయన అధికారులను నాడు గట్టిగానే కోరారు. కానీ ఇప్పటికి ముప్పయ్యేళ్ళు గడచినా కూడా అవి ఇంకా పెరిగాయి కానీ పట్టించుకున్న వారే లేరు. పైగా ప్రభుత్వ స్థలాల్లో ఎక్కువగా మురికివాడలు ఉన్నాయి. రైల్వేస్, ఇతర కేంద్ర, , రాష్ట్ర ప్రభుత్వ స్థలాలు దొరికితే చాలు పాకలు వేసుకుంటూ బతుకులీడుస్తున్న వారే విశాఖలో లక్షల జనాభాగా ఉన్నారు.మరో మాట ఏంటి అంటే మురికివాడలకు సంఘాలు ఉన్నాయి. వాటి వెనక నాయకులు ఉన్నారు. వారిని తరలిస్తే వేరే చోటు చూపించాలని, వారికి ఆవాసాలు కూడా నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మరికొందరు అయితే మురికివాడల పేరిట పాకలు వేయించి ప్రభుత్వ స్థలాలను కాజీయాలని చూస్తున్నారు. దీంతో వైసీపీ సర్కార్ దీని మీద బాగానే దృష్టి పెట్టింది. విశాఖకు పట్టిన మురికి గబ్బు వదిలించాలని కూడా గట్టిగానే సంకల్పించింది. జీవీఎంసీ ఎన్నికల వేళ వైసీపీ ఎన్నికల హామీల్లో ఇది ప్రధానమైనది. విశాఖను పాలనా రాజధానిగా చేస్తున్న వేళ మురికివాడలు ఉండరాదు అన్నదే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది.విశాఖకు దశాబ్దాలుగా పట్టిన మురికి కంపుని తొలగిస్తే మాత్రం ఆ క్రెడిట్ కచ్చితంగా వైసీపీ సర్కార్ కే దక్కుతుంది అంటున్నారు నగర వాసులు. ఈ మేరకు జీవీఎంసీ అధికార యంత్రాంగం దాదాపుగా ఎనిమిది వందల దాకా ఉన్న మురికివాడలలో సమగ్ర సర్వే చేపట్టింది. ఈ సర్వే ద్వారా అక్కడ నివసితున్న వారి డేటాను కలెక్ట్ చేస్తోంది. వారికి ఏం కావాలి. ప్రభుత్వం ఏ విధంగా ఆదుకోవాలి అన్న దాని మీద అభిప్రాయ సేకరణ చేస్తోంది. మురికివాడల వాసులు నగరంతో పని ఉన్న వారే. దినసరి కూలీలుగా పనిచేస్తూ వారు పొట్టపోసుకుంటారు. అందువల్ల వారికి నగరానికి దూరంగా ఎక్కడో ఆవాసాలు ఏర్పాటు చేస్తే వాటిని అమ్ముకుని మళ్ళీ సిటీలోనే పాకలు వేసుకుంటారు. కాబట్టి వారి పనులకు ఇబ్బంది లేకుండా సిటీకి దగ్గరలోనే పక్కా ఇళ్ళు నిర్మించి ఇవ్వాలన్న సూచనలు వస్తున్నాయి. మొత్తానికి విశాఖను మురికివాడలు లేని నగరంగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వం చెబుతోంది. అదే కనుక చేస్తే విశాఖ అందాన్ని సంపూర్ణంగా ఆవిష్కరించినట్లే.

## మనబడి నాడు-నేడు పనులను ప్రారంభించిన 2వ డివిజన్ ఇంచార్జి రామ్మోహన్

నెల్లూరు ఆగస్టు 14, (న్యూస్ పల్స్) నెల్లూరు గ్రామీణ నియోజవర్గ పరిధిలోని 2వ డివిజన్ ప్రాంతంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన మనబడి నాడు-నేడు పూర్తయిన పనులను స్థానిక డివిజన్ ఇంచార్జి పగిడి నేటి రామ్మోహన్ యాదవ్ ప్రారంభించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మరియు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ఇంచార్జి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఆదేశాల ప్రకారం 2వ డివిజన్ గుడిపల్లిపాడులోని జన్నత్ ఉసేన్ నగర్ లో ని ఉర్దూ పాఠశాలలలో 26 లక్షల రూపాయల వ్యయంతో పూర్తైన మరియు అల్లిపురంలోని పీ కే జీ కాలనీ లోని పాఠశాలలో 26.90 లక్షల రూపాయలతో మన బడి నాడు-నేడు పనులను ప్రారంభించడం ఆనందంగా ఉందని తన సంతోషాన్ని వ్యక్తపరిచారు .పేద పిల్లలకు ఉజ్వల భవిష్యత్తును అందివ్వాలనే సంకల్పంతో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేందుకు సహకారం ఇవ్వడం అభినందనీయమని రాష్ట్ర ప్రభుత్వ సేవలను కొనియాడారు. విద్యతోనే అన్ని రంగాలలో రాణించగలరు అనే నానుడి ప్రకారం గా ప్రతి ఒక్క తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత స్థాయి చదువులు చదివించాలని పిలుపునిచ్చారు. పై కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు పందిళ్లపల్లి శ్రీధర్ రెడ్డి, బేతనబోయిన శివరామయ్య,రాచురి రమేష్,కొమరిక నాగరాజు,కడిమి సుధాకర్,డాక్టర్ సుబ్బారావు, తాత పెంచలయ్య,సలీమ్, సత్తార్, మహాభాషా,షఫీ, రావినూతల మల్లికార్జున మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

## కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరు మహిళలను అరెస్ట్ చేసిన పోలీసుల....

ఆదోని ఆగస్టు 14, (న్యూస్ పల్స్) కర్నూలు జిల్లా ఆదోని నియోజకవర్గం కర్ణాటక సరిహద్దు ఉండడంతో కర్ణాటక మద్యం విచ్చలవిడిగా మార్కెట్లో తరలిస్తున్నారు అనేకసార్లు అరెస్టు చేసిన రిమాండ్కు పంపించిన పరవాలేకుండా పోతుంది.. ఆదోని పట్టణ స్టేషన్ లో పాటు ఎక్సైజ్ అధికారులు కూడా ఎన్నోసార్లు కర్ణాటక మద్యంను అమ్మవారి పై దాడి చేసి పట్టుకొని కేసు నమోదు చేయడం జరిగింది కానీ వాళ్లని చీమకుట్టినట్లు కూడా లేదంటే పరిస్థితి కొనసాగుతుంది.. కర్ణాటక మద్యం ఓ.సి 180ఎశ్రీ 90 రూపాయలు అమ్మి డెడ్రా ప్యాకెట్ ఆదోనిలో రెండు వందల రూపాయలకు అమ్మడం జరుగుతున్నది దీనికి డబ్బులు ఎక్కువ సంపాదించుకోవాలనే ఆశతో చాలామంది ఇలాంటి దానికి బానిస అవుతున్నారు. దాంతోపాటు డబ్బు ఆశ చూపించు ఆడ వాళ్లను కూడా లెక్క చేయకుండా మద్యం తరలించడానికి ప్రయత్నం చేస్తున్నారు ఒక్క రూపాయి మద్యం ఉంటే రెండు రూపాయలు ఆదాయం ఉంటుందంటూ ఆశపడి ఇలాంటి అడ్డదారి కు పాల్పడుతున్నారు.. ఇలాంటి సమయంలో శనివారం రోజున ఆదోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో లో రైలు మార్గం ద్వారా 180 ఎశ్రీ ఓ.సి 96 ప్యాకెట్లను ట్రావెలింగ్ బ్యాగ్ లో తరలిస్తుండగా రైల్వే స్టేషన్ సమీపంలో పోలీసులు అనుమానాస్పదంగా వెళుతున్న ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకొని విచారించగా 96 డెడ్ రా ప్యాకెట్ ట్రావెలింగ్ బ్యాక్ లో ఉండడంతో స్టేషన్ తరలించి దాని విలువ దాదాపు 18000 వేలు ఉన్నట్లు వాళ్ళ పై కేసు నమోదు చేయడం జరిగిందని ఆదోని టూ టౌన్ సీఐ శ్రీరాములు మీడియాకు తెలియజేశారు..

# అర్హులకు అందని నేతన్న నేస్తం

కడప ఆగస్టు 14, (న్యూస్ పల్స్)తండ్రిని చంపిన హంతకుల నుంచి ప్రాణ హాని వుందని రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయించిన వివేకానంద రెడ్డి కూతురు తనకు చెల్లి అయిన సునీత కు న్యాయం చేయలేని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలోని మహిళకు ఏం న్యాయం చేస్తారని జనసేన పార్టీ రాయలసీమ సమన్వయ కమిటీ సభ్యులు గంగారపు రామదాస్ చౌదరి ఎద్దేవా చేశారు. తన తండ్రిని చంపిన హంతకులను పట్టుకోవాలని పోలీసులను ఆశ్రయించిన తనపై రెక్కి జరిగిందని చెప్పడం రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎంతగా క్షీణించాయని చెప్పడానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. శనివారం జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో జనసేన పార్టీ జిల్లా ప్రదాన కార్యదర్శి జంగాల శివరామ్ రాయల్, జనసేన పార్టీ చేనేత విభాగం రాష్ట్ర ప్రదాన కార్యదర్శి అడపా సురేంద్ర, మైనారిటీ నాయకులు ఫాజిల్, జనసేన పార్టీ నాయకులు కిరణ్, జగదీష్, పురం నగేష్, లక్ష్మీపతి, వేణు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేతన్న నేస్తం అర్హులైన వారికి అందించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు.నేతన్న నేస్తం లబ్ధిదారుల కుటుంబసభ్యులకు ఇతర పథకంలో లబ్ధి చేకూరుతుందని సాకులు చూపిస్తూ నేతన్న నేస్తంలో అనర్హులుగా చేయడం జరుగుతోందని ఆరోపించారు. గతంలో రెండు విడతలుగా నేతన్న నేస్తం 24 వేల రూపాయలు అందుకున్న లబ్ధిదారులు ప్రస్తుతం అనర్హులుగా మారడంలో సచివాలయం సిబ్బంది, వాలంటీర్ల చేతివాటం వుందని విమర్శించారు. మరో వైపు జనసేన పార్టీ మద్దతుదారులు, మున్సిపల్ ఎన్నికల సమయంలో జనసేన పార్టీ సానుభూతి పరులుగా వున్నవారికి ప్రభుత్వ పథకాలు అందకుండా అడ్డుకోవడం జరుగుతోందని ఆరోపించారు. ఈ సందర్భంగా జిల్లా జనసేన పార్టీ ప్రదాన కార్యదర్శి జంగాల శివరామ్ రాయల్ మాట్లాడుతూ ప్రపంచ మొత్తం తనవైపు చేస్తుందని గొప్పగా చెప్పుకునే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ధరలు పెంచి సామాన్య ప్రజల నడ్డివిరుస్తున్నాడని ఎద్దేవా చేశారు. అంచెలంచెలుగా మద్య నిషేధం అంటూ హామీ ఇచ్చి ప్రస్తుతం అంచెలంచెలుగా మద్యం ధరలు పెంచడం, పెట్రోల్ ధరలు పెంచడం, అమరావతి, పోలవరం నిర్మాణం చేయకపోవడం, కొత్త పరిశ్రమలు రాకపోగా వున్నవి తరలిపోవడం ఇలా అన్నింటా విఫలం కావడంతో ప్రపంచం మొత్తం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైపు చూస్తోందని వ్యంగస్త్రాలు చేశారు. జనసేన పార్టీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలను ఎల్లప్పుడూ ప్రశ్నిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## మృతి చెందిన మత్స్యకార కుటుంబాలను ఆదుకుంటాం

రాష్ట్ర మత్స్యశాఖ, పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ది శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

చేపల వేటకు వెళ్లి ముగ్గురు జాలర్లు మృతి విచారకరం

మృతుల కుటుంబానికి ప్రభుత్వం అన్ని విదాలా ఆదుకుంటుంది

మృతదేహాలను వెలికి తీసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం

స్థానిక ఎమ్మెల్యే, అధికారుల తో మాట్లాడిన మంత్రి

పలాసఆగస్టు 14, (న్యూస్ పల్స్) శ్రీకాకుళం జిల్లా గార మండలంలో విషాదం చోటుచేసుకుంది. సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల్లో ముగ్గురు మత్స్యకారులు గల్లంతయ్యారు. వీరు గార మండలంలోని బందరువానిపేట గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు స్పందించారు. వెంటనే జిల్లా అధికారులతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే మాజీ మంత్రి సీనియర్ నాయకులు ధర్మాన ప్రసాదరావుతో సంబందిత విషయం మాట్లాడి ప్రభుత్వం నుండి మృతుల కుటుంబ సభ్యులకు ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మత్స్యకారులకు ఏ ప్రమాదం జరిగినా నేను ఉన్నాను అంటూ సీఎం జగన్మోహన్ రెడ్డి స్పందిస్తారని అన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకుని విచారాన్ని వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాలు మత్స్యకారుల పట్ల నిర్లక్ష్యం వహించడంతో ఇలాంటి ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక జిల్లాకి ఒక హార్బర్ మంజూరు చేసి చేపల వేటకు అనుకూలం కల్గిస్తున్నారాని తెలిపారు. మత్స్యకారుల జీవితాలు సముద్ర అలలకు బలైపోయి తల్లి గర్భం శోక సముద్రంలో మునిగిపోతుందని ఆవేదన చెందారు. మత్స్యకారుల కష్టాలను తీర్చేందుకు అహర్నిశలు శ్రమిస్తామని హామి ఇచ్చారు. మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు తీసుకుంటుందని హామి ఇచ్చారు. జిల్లా అధికారులతో పోన్ లో మాట్లాడి అన్ని విదాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మత్స్యకారుల గల్లంతు విషయం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లి వీలైనంత త్వరగా వారిని ఆదుకుంటని అన్నారు. పుక్కల్ల గన్నయ్య, గణేష్ తండ్రీ కొడుకులు కాగా అదే గ్రామానికి చెందిన రాయితి పెదరాయుడు లు మృతి చెందినట్లు అధికారులు గుర్తించారు.

## పోలీసుల అదుపులో మణికంఠరెడ్డి

కడప ఆగస్టు 14 (న్యూస్ పల్స్)ఒకవైపు, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ దూకుడు ప్రదర్శస్తోంది. మరోవైపు, తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని జిల్లా పోలీసులకు ఫిర్యాదు చేసింది వివేకా కూతురు సునితా రెడ్డి. దీన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతోంది.ఇదిలావుంటే, రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ దూకుడు పెంచింది. ఈ కేసుకు సంబంధించి రఘునాథ్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో మొదటిసారిగా రఘునాథ్‌రెడ్డిని విచారించింది సీబీఐ. ఇతను సీఎం క్యాంపు కార్యాలయ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తుండటం విశేషం. వైసీపీ రాష్ట్రకార్యదర్శి శివశంకర్‌రెడ్డిని 7 గంటల పాటు సీబీఐ విచారించింది. గతంలో కూడా శివశంకర్‌రెడ్డిని సిట్, సీబీఐ బృందాలు ప్రశ్నించాయి. ఈ కేసులో కీలక సమాచారాన్ని సీబీఐ అధికారులు సేకరించారు. మరోవైపు డాక్టర్ భరత్ రెడ్డిని కూడ సీబీఐ అధికారులు విచారించారు. హత్యకు ఉపయోగించిన ఆయుధాలతో పాటు కీలకమైన డాక్యుమెంట్లను సీబీఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.సీబీఐ అధికారులు ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌కు సన్నిహితులు.. బంధువులను విచారిస్తుండడం రాజకీయంగా కలకలం రేపుతోంది. వారందరికీ హత్యతో ప్రమేయం ఉందా..? లేక రాజకీయ ఒత్తిడిలు ఏమైనా ఉన్నాయా అని వైసీపీ వర్గాలే చర్చించుకునేలా పరిస్థితి మారింది. కానీ, ప్రస్తుతం సీబీఐ దూకుడు చూస్తుంటే త్వరలోనే కేసు కొలిక్కి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు, ఇవాళ మరో కీలక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్న సీబీఐ అధికారులు.. విచారణ చేపట్టారు. వైఎస్ వివేకానంద కుమార్తె ఫిర్యాదు మేరకు.. మణికంత రెడ్డిని పులివెందుల పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. గత నెలలో వైఎస్ వివేకా ఇంటి వద్ద రెక్కీ నిర్వహించినట్టు మణికంత రెడ్డిపై ఆరోపణలు ఉన్నాయి. వివేకా హత్య కేసు నిందితులతో ప్రాణహాని ఉందని శుక్రవారం ఎస్పీకి వైఎస్ సునీత లేఖ రాశారు. ఆమె ఫిర్యాదు మేరకు ఇవాళ మణికంఠరెడ్డిని అదుపులోకి తీసుకున్న పులివెందుల డిఎస్పీ శ్రీనివాసులు విచారిస్తున్నట్లు తెలిపా

## ఈ నెల 19 న కిషన్ రెడ్డి జన ఆశీర్వాద యాత్ర

హైదరాబాద్ ఆగస్టు 14, (న్యూస్ పల్స్) తెలంగాణలో కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి జన ఆశీర్వాద యాత్ర ఖరారయింది. ఆగస్టు 19 నుండి 21 వరకు కోదాడ నుండి హైదరాబాద్ వరకు యాత్ర కొనసాగనుంది. ఆగస్టు 19 సాయంత్రం నాలుగు గంటలకు కోదాడ లో జన ఆశీర్వాద యాత్ర ప్రారంభం అవుతుంది. ఆ రోజు సూర్యాపేటలో రాత్రి బస వుంటుంది. 20వ తేదీన దంతాలపల్లి, తొర్రూరు, రాయపర్తి, వర్ధన్నపేట, వరంగల్ లో యాత్రా వుంటుంది. భద్రకాళి మాత దర్శనం తరువాత వరంగల్, హనుమకొండ లో తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు అయన శ్రద్ధాంజలి ఘటించనున్నారు. ఖిల్లాషాపూర్ లో సర్వాయి పాపన్న గ్రామం నుండి జనగామ, ఆలేరు, యాదగిరిగుట్ట లో పర్యటిస్తారు. వరంగల్ లో ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వ్యాక్సినేషన్ సెంటర్ ను సందర్శించనున్నారు. ఆలేరులో పద్మశ్రీ అవార్డు అందుకున్న చేనేత కళాకారులు( కార్మికులు) చింతకింది మల్లేష్ కుటుంబాన్ని పరామర్శిస్తారు. యాదగిరిగుట్టలో లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో దర్శనం చేసుకున్న అనంతరం యాదగిరిగుట్టలో రాత్రి బస చేస్తారు. 21న ఉదయం భువనగిరిలో రేషన్ షాప్ సందర్శించనున్నారు. ఘట్కేసర్, ఉప్పల్ మీదుగా సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం మీదుగా నాంపల్లి బిజెపి రాష్ట్ర కార్యాలయం చేరుకుంటారు. 21న రాత్రి 7 గంటలకు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సభ వుంటుంది. 12 జిల్లాల మీదుగా, 7 పార్లమెంట్ నియోజకవర్గాల మీదుగా 17 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా, 324 కిలోమీటర్లు జి కిషన్ రెడ్డి నేతృత్వంలో జన ఆశీర్వాద యాత్ర జరుగుతుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మంత్రి వర్గ విస్తరణలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిన విధానాన్ని వివరించనున్నారు. నరేంద్ర మోడీ రైతాంగానికి లాభసాటి చేసే విధంగా విధానాలు రూపొందించడం, పేద ప్రజల కోసం చేపడుతున్న సంక్షేమ - అభివృద్ధి విషయాలను ప్రధానంగా ఈ యాత్రలో ప్రస్తావిస్తారు.

## ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

హైదరాబాద్ గ్రీన్ ఇండియా చాలెంజ్, హరితహారం లో భాగంగా దిల్సుక్ నగర్ లో ఉన్న గురునానక్ పాణినీయ డెంటల్ కాలేజ్ ప్రాంగణం ప్రాజెక్ట్ ఉగాఓ లో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ఐకాన్ సభ్యులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అసిస్టెంట్ గవర్నర్ రోటరీ క్లబ్ సికింద్రాబాద్ శిరీష ఆకుల, అధ్యక్షుడు అలెక్స్ గంట, గురునానక్ ఇన్స్టిట్యూట్ చైర్మన్ జీఎస్ కోహ్లీ హాజరయ్యారు. మొక్కలు నాటడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడానికి ద్రోహ పడుతుందని అన్నారు. వాతావరణంలో మార్పులు వచ్చి ఉష్ణోగ్రతలు తగ్గి అవకాశం ఉందని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ఐకాన్ సభ్యులు,కాలేజ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజుల కోసం ప్రైవేట్ విద్యా సంస్థల ఒత్తిడి

మెదక్, ఆగస్టు 14, (న్యూస్ పల్స్)కరోనా కాటుకు జనజీవనం అస్తవ్యస్తమైంది. విద్యా సంస్థలు సైతం గత ఏడాదిన్నరగా మూసేసి ఉన్నాయి. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని పిల్లలెవరూ చదువుకు దూరం కావొద్దని భావించిన సర్కారు ఆన్‌లైన్ క్లాసులకు అనుమతి ఇచ్చింది. ఈ క్రమంలో ప్రైవేటు విద్యా సంస్థలు ఆన్‌లైన్ క్లాసులు ప్రారంభించాయి. గత కొంత కాలంగా కరోనా కేసులు తగ్గుముఖం పట్టడంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంస్థల ప్రారంభానికి సన్నాహాలు చేస్తోంది. దీంతో, అప్రమత్తమైన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఆన్‌లైన్ క్లాసులకు సంబంధించి ఫీజులు వసూలు చేసేందుకు సిద్ధమయ్యాయి. ఇప్పటికే పాఠశాల యాజమాన్యాల నుంచి పేరెంట్స్ సందేశాలు పంపించారు. కొంత మంది డైరెక్ట్‌గా కాల్ చేసి మొత్తం ఫీజు కడితేనే ఆన్‌లైన్ క్లాసులకు అనుమతిస్తామంటూ బెదిరిస్తున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఇంత అకస్మాత్తుగా ఫీజు ఎలా చెల్లించాలంటూ ఆందోళన చెందుతున్నారు.ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా సుమారు 650 పైచిలుకు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. సిద్దిపేట జిల్లాలో 293 ప్రైవేటు పాఠశాలలుండగా సంగారెడ్డి జిల్లాలో 295 ప్రైవేటు పాఠశాలలు, మెదక్ జిల్లాలో వంద వరకు ప్రైవేటు పాఠశాలలు ఉన్నట్టు సమాచారం. ఈ పాఠశాలలో 1-10 తరగతులు కలిపి లక్ష వరకు మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి 9, 10 తరగతులకు ప్రత్యక్ష బోధన ప్రారంభించారు. విద్యార్థుల హాజరు శాతం పెరగడంతో మార్చి ఒకటో తేదీ నుంచి 6, 7, 8 తరగతులకు కూడా ప్రత్యక్ష బోధన ప్రారంభించారుఅయితే, ప్రత్యక్ష బోధన ప్రారంభించిన పదిహేను రోజులకే కరోనా కేసులు విపరీతంగా పెరగడంతో ప్రత్యక్ష బోధన నిలిపివేశారు.

## తెలుగు భాష అభివృద్ధికి కృషి

తిరుమల ఆగస్టు 14, (న్యూస్ పల్స్తెలుగు భాష అభివృద్ధికి కృషి చేస్తాంని తెలుగు అకాడమీ ఛైర్మన్ లక్ష్మీ పార్వతి అన్నారు..ఇవాళ ఉదయం వి.ఐ.పి విరామ సమయంలో స్వామి వారి సేవలో పాల్గోని మొక్కులు చెల్లించుకున్నారు..అనంతరం ఆలయ వెలుపలకు వచ్చిన ఆమె మీడియాతో మాట్లాడుతూ...తెలుగు బాషా చైతన్య సదస్సులు తిరుపతిలో నిర్వహించాంమని,తెలుగు, సంస్కృత బాషా కవులు ఈ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున్న పాల్గొన్నారని ఆమె తెలియజేసారు..తెలుగు అకాడమీ పని తీరు చూసి తెలంగాణ గవర్నమెంట్ కూడా ఫండ్స్ ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు..ఒక్క ఏడాదిలో తెలుగు అకాడమీ ఎన్నో విజయాలు సాధించిందని సంతోషం వ్యక్తం చేసారు..పుస్తకాల ప్రింటింగ్ చేయించాంమని,మరో పది రోజుల్లో పుస్తకాలను విద్యార్థులకు అందిస్తాంమన్నారు..తిరుపతి కేంద్రంగా తెలుగు సంస్కృతి అకాడమీ బాధ్యతలు జగన్ నాకు ఇచ్చారని ఆనందం వ్యక్తం చేసారు..తెలుగు బాషా అభివృద్ధి కోసం కృషి చేస్తున్నాంమని,లోయర్ క్లాస్ నుంచి హయ్యర్ ఎడ్యుకేషన్ వరకు తెలుగు తప్పనిసరి చేసాంమని ఆమె ధీమా వ్యక్తం చేసారు..గత ప్రభుత్వం వదిలేసిన, వైసీపీ ప్రభుత్వం తిరిగి తెలుగు అకాడమిని తీసుకొచ్చిందన్నారు..టీటీడీ చైర్మన్ గా సుబ్బారెడ్డి నియమించడం ఆనందదాయకంమన్నారు..

## చంద్రబాబు అనురాగాలు లేని వ్యక్తి

తిరుమల ఆగస్టు 14, (న్యూస్ పల్స్కులమత వ్యత్యాసాలకు తావు లేకుండా, పార్టిల విద్వేషాలు లేకుండా పేదలకజ సీఎం జగన్ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఏపి డెప్యూటీ సీఎం నారాయణ స్వామి తెలిపారు.. ఇవాళ ఉదయం వి.ఐ.పి విరామ సమయంలో స్వామి వారి సేవలో పాల్గోని మొక్కులు చెల్లించుకున్నారు..అనంతరం ఆలయ వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ..శిధిలావస్థలో ఉన్న హిందూ దేవాలయాలను సీఎం జగన్ పునర్నిస్తున్నారని, పేదవాడు ఆర్థిక పరిస్థితి మెరుగు పడాలని,విద్యావంతులు కావాలన్నదే సీఎం ఆకాంక్షిస్తున్నారన్నారు..చంద్రబాబు హయాంలో ఎన్ని దేవాలయాలు పునరుద్ధరించారో లెక్క చెప్పాలని ఆయన ప్రశ్నించారు..చంద్రబాబు నాయుడు వైపు ఉన్న వారు కొందరు ఒకే మతానికి సీఎం జగన్ ను ఆపాదించడం చాలా తప్పుని అన్నారు..జీడీ నెల్లూరు నియోజకవర్గంలో నీటి కరువు తాండ విస్తుందని, ఎన్టీఆర్ జలాశయం నుంచి నీటిని మా నియోజకవర్గానికి వచ్చేలా చేయాలనీ సీఎం జగన్ ను విజ్ఞప్తి చేసాంమన్నారు..ఆయనకు ఓటు వేయని వారికి కూడా ప్రభుత్వ పథకాలు అందేలా సీఎం జగన్ చూస్తున్నారని,బిజెపి,టీడీపీ పని గట్టుకొని సీఎం జగన్ పై ఆరోపణలు చేయడం తగదన్నారు..పెదాలపై ప్రేమ..ఆప్యాయత... అనురాగాలు లేని వ్యక్తి చంద్రబాబు అని,ఒక్క పేద కుటుంబానికైనా ఇంటి స్థలాన్ని చంద్రబాబు ఇచ్చాడా అని ఆయన ప్రశ్నించారు.

## మహిళ దారుణ హత్య

మంగళగిరిఆగస్టు 14, (న్యూస్ పల్స్మంగళగిరి కొప్పు రావు కాలనీ లో దారుణ ఘటన జరిగింది. ఎంతో కాలంగా తన తో సహజీవనం చేస్తున్న మహిళను సాంబశివరావు అనే వ్యక్తి గొంతు కోసి తో హత్య చేసాడు. విషయం తెలిసిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. సాంబశివరావు పై ఇప్పటికే లైంగిక వేధింపుల కేసు ఉంది. తనతో పాటు తన కూతురు కూడా లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడని మృతి చెందిన మహిళ గతంలో పోలీసులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపించడం జరిగింది. జైలు నుంచి విడుదలైన ఇటీవలే విడుదలైన సాంబశివరావు కక్షతో హత్య చేసి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు..

## సీతానగరం ఎస్.ఐ గా పదవీ బాధ్యతలను చేపట్టిన శుభ శేఖర్

రాజానగరం ఆగస్టు 14, (న్యూస్ పల్స్సీతానగరం మండలం పోలీస్ స్టేషన్ ఎస్.ఐ. వై సుధాకర్ బదిలీ కావడంతో నూతన ఎస్.ఐ గా పదవీ బాధ్యతలను శుభ శేఖర్ చేపట్టారు.గతంలో బొమ్మూరు పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తూ రెగ్యులర్ బదిలీపై సీతానగరం మండలం పి.ఎస్ నందు జాయిన్ అయినట్లుగా మీడియా కు తెలియజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ శాంతిబద్రతలను, ప్రజల హక్కులను కాపాడే సందర్భంలో ఖఠినంగా వ్యవహరిస్తామని, బహిరంగ ప్రదేశాల్లోనూ మద్యం సేవించుట,వాహనాల రికార్డులు లేకుండా నడుపుట, గంజాయి సేవించటం,నాటుసారా, ట్రాఫిక్ నిబందనలు పాటించకపోవటం బెట్టింగులు, పేకాట వంటి వాటిని ఎవరూ ప్రోత్సహించవద్దని ఈ విదమైన చట్టవ్యతిరేక పనులు ఎవరు చేసినా ఖఠిటిన చర్యలు తీసుకుంటామని,ఎనభై శాతానికి పైగా గోడవలు జరుగుతూన్నాయని నివేదికలు చెబుతున్నాయని అన్నారు. ప్రజలు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఎవరికి ఏ సమయంలో అవసరమైనా అందుబాటులో ఉంటానని అన్నారు. త్వరలో గ్రామ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి దిశ వంటి చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం చేపడతానని అన్నారు. ప్రజలకు ఇబ్బందులు ఎర్పడిన సందర్భాల్లో తమకుసమాచారం అందించవచ్చునని వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. శాంతిబద్రతలు ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు రాజీపడేది లేదని అందుకోసం అందరూ సహకరించాలని అన్నారు.

## అరకు పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శిగా నరంజి ప్రసాద్ ఎన్నిక

ఘనంగా సన్మానించిన పార్టీ కార్యకర్తలు

విశాఖపట్నం ఆగస్టు 14, (న్యూస్ పల్సఅరకు పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శిగా నరంజి ప్రసాద్ ఎన్నికయ్యారు.తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఆదేశాలు మేరకు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పనిచేస్తారని నరంజి ప్రసాద్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి గా నియమించినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి అనంతరం పెదబయలు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు సీకరి సుకుమరి చేతులు మీదుగా ఘనంగా సన్మానించారు.అనంతరం నరంజి ప్రసాద్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నన్ను నమ్మి అప్పగించిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని పార్టీ బలోపేతనానికి అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు.నాకు ఈ పదవి రావడానికి ప్రోత్సహించిన అరకు ఇంచార్జ్ కిడారి శ్రావణ్ గారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి వెచ్చనీగి కొండయ్య,కూడా భూషణ్, రాజారావు,మండలానికి సంబంధించి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# టెస్టుల పేర్ల తో ల్యాబ్ ల దోపిడీని అరికట్టాలి

ఏ ఐ వై యఫ్ జిల్లా ఆర్గనైజర్ సొంటి పులిశేఖర్



డోన్ ఆగస్టు 14, ( విభారె) ,:టెస్టుల పేర్లతో ల్యాబ్ ల దోపిడీని అరికట్టాలి అని సొంటి. పులి శేఖర్ అన్నారు,స్థానిక డోన్ పట్టణంలో టెస్టుల పేర్లతో ల్యాబ్ యజమానులు ఆర్ఎంపీ డాక్టర్లు సిండికేట్గా ఏర్పడి ప్రజల నుండి నిలువు దోపిడీ చేస్తున్నారని ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సొంటి పులి శేఖర్ నియోజకవర్గ అధ్యక్షులు జి సుధాకర్ లు డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ బాల చంద్ర రెడ్డి గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చీరాని టెస్టు ల తో టైఫాయిడ్ జ్వరం వస్తే జండ్రీస్ అని తప్పుడు రిపోర్టులు ఇస్తున్నారని వారు మండిపడ్డారు అంతేగాక ఎటువంటి రసీదు లేకుండా వందల రూపాయలు దండుకుంటున్నారు చిన్న జ్వరం వచ్చిందని వెళితే దాదాపు 15 రకాల టెస్టు లు రాసి ఆర్ఎంపీ డాక్టర్ కు 50 పర్సెంటేజ్ ల్యాబ్ యజమానికి 50పర్సంటేజ్ సిండికేటు గా ఏర్పడి ప్రజల నుండి విచ్చలవిడిగా సొమ్ము చేసుకుంటున్నారు అని వీటిని తక్షణమే ప్రభుత్వ అధికారులు స్పందించి ల్యాబ్ లను సీజ్ చేయాలని అదేవిధంగా ల్యాబ్ యజమానుల పైన ఆర్ఎంపీ డాక్టర్ ల పైన క్రిమినల్ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు ప్రజల ఆరోగ్య జీవితాలతో చెలగాటమాడితే అఖిలభారత యువజన సమైక్య ఏఐవైఎఫ్ గా చూస్తూ ఊరుకోమని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు పిరా. సుధాకర్. రామకృష్ణ. నాగరాజు. హరీష్ పాల్గొన్నారు..

## శిథిలావస్థలో పూర్వ పాఠశాల

పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా

యువనాయకులు ప్రధీప్ రెడ్డి

. మంత్రాలయంఆగస్టు 14, ( విభారె : శిథిలావస్థకు చేరుకున్న పూర్వ పాఠశాల అయిన మంత్రాలయం మండల పరిధిలోని బూదూరు గ్రామంలో ఉన్న పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని వైఎస్సార్సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యులు వై. ప్రదీప్ అన్నారు. శనివారం గ్రామంలో పర్యటించిన ఆయన ముందుగా బీసీ కాలన్నీల్లోని పాఠశాల ఆవరణలో పాఠశాల దుస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి గారి ఆదేశాల మేరకు నాడు-నేడు రెండవ విడత జాబితాలో పాఠశాలను చేర్చి వెంటనే మరమ్మతులు చేపట్టాలని విద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

# గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు

సీఐ పార్థసారథిభక్తి శ్రద్ధలతో మొహరం

వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి ఎస్ ఐ

మన్మధ విజయ్



కౌతాళం ఆగస్టు 14, ( విభారె) కౌతాళం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించే మొహరం పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎవరైనా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని గ్రామస్తులు సమక్షంలో ఆదోని సీఐ పార్థసారథి కౌతాళం ఎస్ఐ మన్మధ విజయ్ తెలియజేశారు. శనివారం రోజున మండల పరిధిలో ని కుంటానహల్ గ్రామంలో స్థానిక స్థానిక ప్రజలతో మొహరం పండుగ నిర్వహణపై అవగాహన కల్పించారు. మొహరం పండుగ వేడుకలలో ఎటువంటి అల్లర్లు,గొడవలు సృష్టించకుండా భక్తి శ్రద్ధలతో మొహరం పండుగ వేడుకలను నిర్వహించుకోవాలని హాజరైన గ్రామ పెద్దలకు, ప్రజలకు తెలియజేశారు. మొహరం పండుగ సమయంలో శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. గ్రామాలలో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని సి ఐ ఎస్సై, ప్రజలకు తెలియజేశారు. అదేవిధంగా దేవుళ్ళ ఊరేగింపు సమయంలో కోవిడ్ నిబంధనలను ప్రతి ఒక్కరు తప్పకుండా పాటించాలని తెలియజేశారు. పీర్ల చావిడి వద్ద జనాలు గుంపుగా ఉండకూడదని,మాస్కులు ధరించి భౌతిక దూరాలను పాటించాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల అభివృద్ధితో రాష్ట్ర కీర్తిని ప్రపంచస్థాయికి తీసుకువెళతాం

రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్

బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి

కడప, ఆగస్టు 14 : రాష్ట్రంలో క్రీడా రంగాన్ని అత్యంత ప్రాధాన్యతతో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లి.. రాష్ట్ర కీర్తిని ప్రపంచ స్థాయిలో చాటి చెబుతామని... రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ గా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన బైరెడ్డి సిద్దార్థ రెడ్డి.. మొట్టమొదటిసారిగా శనివారం కడప నగరంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అవరణలోని ఇండోర్, ఔట్ డోర్ స్టేడియంలను, అన్నిరకాల క్రీడలకు సంబంధించి మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో ఆయా క్రీడలకు సంబంధించిన కోచ్ ల నియామకానికి అవసరమైన చర్యలను చేపడుతామన్నారు. క్రీడారంగంలో నూతన పాలసీని తీసుకువచ్చి.. క్రీడల అభివృద్ధికి, క్రీడాకారుల సంక్షేమానికి పెద్దపీట వేయాలనేది.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆకాంక్ష అన్నారు. ఆ దిశగానే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని స్పోర్ట్స్ అతరిటీల్లో మౌలిక వసతులు, క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు అందివ్వడం జరుగుతోందన్నారు. క్రీడారంగం అభివృద్ధి చెందాలంటే.. క్రీడల గురించి బాగా తెలిసిన వారే ఖచ్చితమైన న్యాయం చేయగలరన్నారు. క్రీడలపై ప్రత్యేక అభిమానం వున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థను



మరింత పటిష్టం చేస్తున్నారన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఆ ప్రభావం రాష్ట్ర ఆర్థిక పరిస్థితితో పాటు.. క్రీడా రంగంపై అధికంగా పడిందన్నారు. దాంతో పాటు గత ప్రభుత్వ హయాంలో కూడా.. క్రీడారంగం ఆదరణకు నోచుకోలేక పోయిందన్నారు. ఆ పరిస్థితుల్లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేసి, అన్నివర్గాల ప్రజలకు సమ న్యాయం చేస్తున్నారన్నారు.

# శితిలావత్సకు చేరుకున్న తిమ్మాపురం పాఠశాల

నాడు నేడు నోచుకోని తిమ్మ పురం పాఠశాల

మరమ్మతులకు నోచుకోని పాఠశాల పై

గ్రామస్తులు మండిపాటు





కౌతాళం ఆగస్టు 14, ( విభారె) :శిథిలావస్థకు చేరుకున్న, నాడు నేడు మరమ్మతులకు నోచుకోని పాఠశాల పై తిమ్మ పురం గ్రామస్తులు మండిపడ్డారు. వివరాలకు వెళ్ళితే కౌతాళం మండల పరిధిలోని ఉరుకుంద గ్రామం అనుకోని తిమ్మాపురం గ్రామం ఉంది ఆ గ్రామంలో మండల పరిషత్ హైస్కూలు ప్రాథమిక పాఠశాల లో 40 మంది బాలబాలికలు చదువు తున్న బడిలో హీనాస్తితిలో అద్వాన్నంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిల్లలకోసం నాడు నేడు కింద పాఠశాల కు నిధులు ఏర్పాట్లు చేసి పాఠశాలాలను ఎంతో అందంగా తీర్చిదిద్దారు అన్న సంగతి అందరికీ తెలుసు కానీ తిమ్మాపురం పాఠశాల లో సిమెంట్ పెచ్చులు ఉడి, లోపల బండలు పగిలి గుంతలతో దర్శనమిస్తున్నాయి. కానీ పట్టించే నాథుడు కరువయ్యారు. ఇదేమిటి అని ప్రధానోపాధ్యాయులు రమేష్ ను అడిగితే జిల్లా అధికారులకు నివేదిక పంపాము కానీ ఇంకా ఆర్డర్ రాలేదని తెలిపారు. సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం వల్ల పిల్లలు పాఠశాలలు కు వెల్లలంటే భయపడుతున్నారు ఎందుకంటే విషాపురుగులు ఉంటాయని భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి రూపురేఖలు మార్చాలని సర్పంచ్ గ్రామస్తులుఅందురు కోరుతున్నారు.

# అక్కినేని హీరో 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' రిలీజ్ డేట్ ఫిక్స్..!




'చిలసౌ' వంటి సూపర్ హిట్ అందుకున్న అక్కినేని యంగ్ హీరో సుశాంత్.. చివరగా 'అల వైకుంఠపురములో' వంటి బ్లాక్ బస్టర్ సినిమాలో కీలక పాత్రలో కనిపించాడు. ఇప్పుడు "ఇచ్చట వాహనములు నిలుపరాదు" అనే రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. 'నో పార్కింగ్' అనేది ఉప శీర్షిక. వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రానికి ఎస్.దర్శన్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. ఎంఔఖీ చిత్రాన్ని ఆగస్టు 27న థియేట్రికల్ రిలీజ్ చేయనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. కోవిడ్ ఫస్ట్ వేవ్ తరువాత తెలుగు సినిమాలు ఎలాగైతే బాక్సాఫీస్ వద్ద సక్సెస్ ఫుల్ గా నడిచాయో.. అదేవిధంగా మహమ్మారి సెకండ్ వేవ్ తర్వాత తెలుగు ప్రేక్షకులు థియేటర్లకు వస్తున్నారు. ఇటీవల విడుదలైన చిత్రాలు ప్రేక్షకాదరణ తెచ్చుకున్నాయి. స్పెషల్ కంటెంట్ ని ఏ సందర్భంలోనైనా ఆదరించే తెలుగు ప్రేక్షకులు.. నావెల్ కాన్సెప్ట్ తో ఒక విలక్షణమైన థ్రిల్లర్ గా వస్తున్న ఎంఔఖీ చిత్రాన్ని కూడా ప్రోత్సహిస్తారని చిత్ర యూనిట్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా 'థియేటర్ల వద్ద మాత్రమే పార్కింగ్ అందుబాటులో ఉంది' అంటూ వదిలిన రిలీజ్ అనౌన్స్ మెంట్ పోస్టర్ ఆకట్టుకుంటోంది.'ఇచ్చట వాహనములు నిలుపరాదు' చిత్రంలో సుశాంత్ సరసన మీనాక్షి చౌదరి కథానాయికగా కనిపించనుంది. వెంకట్ - వెన్నెల కిషోర్ - ప్రియదర్శి - అభినవ్ గోమతం - ఐశ్వర్య - నిఖిల్ కైలాస - కృష్ణ చైతన్య ఇతరులు ఇతర పాత్రలు పోషించారు. ఏ1 స్టూడియోస్ మరియు శాస్త్ర మూవీస్ బ్యానర్లపై రవిశంకర్ శాస్త్రి - ఏక్తా శాస్త్రి - హరీష్ కోయలగుండ్ల సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రవీణ్ లక్కరాజు ఈ చిత్రానికి సంగీతం సమకూర్చారు. ఎం.సుకుమార్ సినిమాటోగ్రఫీ అందించగా.. గ్యారీ ఎడిటింగ్ వర్క్ చేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఎంఔఖీ ప్రచార చిత్రాలు - టీజర్ - సాంగ్ మంచి రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. రిలీజ్ డేట్ దగ్గరలోనే ఉంది కాబట్టి రాబోయే రోజుల్లో చిత్ర బృందం ప్రమోషన్స్ వేగవంతం చేయనున్నారు.

# బన్ని టీమ్ కావాలానే లీక్ చేశారంటూ..!




లీకుల బెడద టాలీవుడ్ ని వదిలేట్టు లేదు. ఇది కూడా మహమ్మారీలా వెంటాడుతోంది. ఏళ్ల తరబడి ఇదే క్రతువు. పవన్- అత్తారింటికి దారేది పూర్తి సినిమా ఆన్ లైన్ లో రిలీజైపోయాక.. దేవరకొండ- టాక్సీవాలా సినిమా కూడా ముప్పావు భాగం పైరసీలో లీకైపోవడం అప్పట్లో కలకలం రేపింది. ఇక ఆన్ లొకేషన్ నుంచి ఫోటోలు వీడియోల లీకుల గురించి చెప్పాల్సిన పనే లేదు. అసలు సినిమా కథేంటో తెలియనీకుండా దాచాలన్న ప్రయత్నాలు చాలా సార్లు లీకుల వల్ల దాగలేదు. బాహుబలి ఫ్రాంఛైజీ మొదలు అగ్ర హీరోలు నటించిన ప్రతి సినిమాకి సంబంధించిన క్లిప్పింగులు చిత్రబృందం అధికారికంగా రిలీజ్ చేయకముందే బయటపడిపోతున్నాయి. ఇటీవల 'పుష్ప'ను ఈ బెడద వదల్లేదు. ఇంతకుముందు ఆన్ లొకేషన్ నుంచి ఫోటోలు క్లిప్పింగులు లీకైపోయాయి. తాజాగా దాక్కో దాక్కో మేక (మొదటి) సాంగ్ ని నేడు (శుక్రవారం) విడుదల చేస్తామని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. కానీ అంతకుముందే రఫ్ వెర్షన్ లీకైపోవడం కలకలం రేపింది. ఈ పాటను దేవీశ్రీ ఆలపించగా.. బన్ని లుక్ రఫ్ అండ్ రఫ్ గా కనిపించనుంది. చూస్తుంటే బన్ని ఫ్యాన్స్ నేటి సాయంత్రం వరకూ ఆగడం కష్టమే. పాట గురువారం సాయంత్రమే లీక్ అయిపోవడంతో అసలేమైందో అర్థం కాలేదు ఎవరికీ. డిజిటల్ లో లీకులివ్వడం సులువు. దీనిని ఎవరు విడుదల చేసారో కానీ విజువల్స్ అయితే లేవు. కానీ పాట రఫ్ గా వినిపిస్తోంది. చిత్రబృందం ఈ లీకులకు కారణమెవరో కనిపెట్టి ఇకపై అలా జరగకుండా నిలువరిస్తుందేమో చూడాలి. లీకులపై డౌట్స్ ఉన్నాయంటూ..!పుష్ప సాంగ్ లీక్ అయిందా లీక్ చేసారా...! వాస్తవానికి అభిమానుల్లో టూమచ్ అంచనాలతో ఎక్కువ ఆసక్తి ఉన్న సినిమా పబ్లిసిటీ కంటెంట్ ఇలా లీక్ అవ్వడం పరిపాటే. తాజాగా మహేశ్ బాబు సర్కారి వారి పాట టీజర్ కూడా ఇలానే రిలీజ్ టైమ్ కి ముందే లీక్ అయింది. ఇప్పుడు పాన్ ఇండియా సినిమా పుష్ప పాట కూడా ఇదే విధంగా లీక్ అవ్వడం పై సోషల్ మీడియా రకరకాల కామెంట్స్ వినిపిస్తున్నాయి. అందులో చాలా మంది ఈ పాటను బన్నీ టీమ్ కావాలానే లీక్ చేశారని గుసగుసగా మాట్లాడుకోవడం వినిపిస్తోంది. పుష్ప డ్యూయాలజీలో మొదటి భాగం దసరా కానుకగా లేదా క్రిస్మస్ కానుకగా రిలీజ్ కానుంది. దసరా కుదరకపోతే క్రిస్మస్ కి వెళుతుందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ చిత్రంలో రష్మిక మందన కథానాయిక. బన్ని గంధపు చెక్కల స్మగ్లర్ గా కనిపిస్తారు. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ అత్యంత భారీ బడ్జెట్ తో నిర్మిస్తోంది.

# మరీ ఇంత కమర్షియల్ అయితే ఎలా అనిరుథ్?

తమిళనాట ఏఆర్ రహమాన్ తర్వాత స్థానంలో అనిరుథ్ నిలుస్తాడు అనడంలో సందేహం లేదు. చిన్న వయసులో.. తక్కువ సినిమాలతోనే సంగీత దర్శకుడిగా టాప్ పొజీషన్ కు వెళ్లిన అనిరుథ్ ఇప్పుడు తెలుగు లో కూడా స్టార్ డం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. తెలుగులో ఈయన మొదటి సినిమా అజ్ఞాతవాసి తీవ్రంగా నిరాశ పర్చింది. సినిమాలోని పాటలు మినిమంగా కూడా ఆకట్టుకోలేక పోయాయి. దాంతో తెలుగు వారికి అనిరుథ్ ఎక్కక పోవచ్చు అంటూ అంతా భావించారు. ఆ తర్వాత అనిరుథ్ కు ఆఫర్లు దక్కలేదు. రహమాన్ తర్వాత సౌత్ లో రచ్చ చేయగల సత్తా ఉన్న దర్శకుడు అనిరుథ్ అనుకుంటే తెలుగు లో మాత్రం ఆయన పాటలు ఆ రేంజ్ లో వినిపించింది లేదు. అజ్ఞాతవాసి తర్వాత నాని నటించిన రెండు సినిమా లు 'నాని గ్యాంగ్



లీడర్' మరియు 'జెర్సీ' సినిమాలకు అనిరుథ్ సంగీతాన్ని ఇవ్వడం జరిగింది. ఆ రెండు సినిమాలు పాజిటివ్ రెస్పాన్స్ దక్కించుకున్నాయి. అందులోని పాటలు కూడా పర్వాలేదు అన్నట్లుగా ఆకట్టుకున్నాయి. తెలుగులో ఇంకా క్రేజ్ దక్కించుకోవాలంటే మరిన్ని సినిమాలు చేయాలి.. సక్సెస్ ఫుల్ మ్యూజిక్ ఆల్బం లను ఇవ్వాల్సి ఉంటుంది. అందుకోసం అనిరుథ్ ఎక్కువ సినిమాలు చేయాలి. ఇప్పటి వరకు బిగ్ కమర్షియల్ హిట్ ను దక్కించుకోని కారణంగా పెద్ద హీరోలు ఈయనతో వర్క్ కు ఆసక్తి చూపడం లేదు అనే టాక్. చిన్న సినిమాలకు ఈయన అందనంత ఎత్తులో ఉన్నాడట. ఈయన పారితోషికం మూడు నుండి అయిదు కోట్ల వరకు ఉంటుందని తమిళ మీడియా వర్గాల కథనం. అందుకే తెలుగు లో చిన్న సినిమాలకు ఈయన అందని ద్రాక్షల మిగిలి పోయాడు. అనిరుథ్ ను ఇటీవల కొరటాల శివ ఎన్టీఆర్ 30 కోసం సంప్రదించాడు అనే వార్తలు వస్తున్నాయి. ఎన్టీఆర్ సినిమా కోసం అనిరుథ్ ను సంప్రదించగా ఆయన చెప్పిన పారితోషికం మరీ టూ మచ్ అన్నట్లుగా ఉందట. తమిళంలో ఆయన చేసిన మాస్టర్ మూవీ విజయాన్ని సొంతం చేసుకున్న కారణంగా పారితోషికంను భారీగా పెంచేశాడు. అక్కడ మాత్రమే కాకుండా ఇక్కడ కూడా అదే పారితోషికంను డిమాండ్ చేస్తున్నాడట. తెలుగు లో పెద్దగా మార్కెట్ లేని అనిరుథ్ కు అంతగా పారితోషికం ఇవ్వడం ఎంత వరకు వర్కౌట్ అవుతుందనే విషయంలో మేకర్స్ మల్లగుల్లాలు పడుతున్నారట. అనిరుథ్ మరీ అంతగా కమర్షియల్ అయితే తెలుగులో స్టార్ డం దక్కించుకోవడం కష్టం అని.. చిన్న పెద్ద సినిమాలు చేసి కమర్షియల్ గా భారీ విజయాలు దక్కించుకుంటే అప్పుడు పారితోషికం ఎక్కువ డిమాండ్ చేయవచ్చు. ప్రస్తుతం సౌత్ ఇండియాలో అత్యధిక పారితోషికం ను అందుకుంటున్న సంగీత దర్శకుడిగా అనిరుథ్ నిలిచాడు. మరి అంత మొత్తంను ఆయనకు ఇచ్చి ఎన్టీఆర్ 30 మేకర్స్ వర్క్ చేయించుకుంటారా అనేది చూడాలి.

# ఒలింపిక్స్ స్వర్ణ విజేత నీరజ్ చోప్రాకు తీవ్ర జ్వరం




చండీగఢ్: టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించిన జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా రెండు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. కరోనా వైరస్ సోకిందేమోనని అందరూ ఆందోళన చెందుతున్న నేపథ్యంలో నీరజ్‌కు పరీక్షలు చేయగా నెగటివ్ తేలింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అతడి ఆరోగ్య పరిస్థితి కొంత మెరుగ్గా ఉందని వైద్యులు తెలిపారు. హరియాణాకు చెందిన నీరజ్ చోప్రా జావెలన్ త్రోయర్‌లో స్వర్ణ పతకం సాధించి త్రివర్ణ పతాకాన్ని ప్రపంచ వేదికపై రెపరెపలాడించాడు. స్వదేశానికి వచ్చిన నీరజ్‌కు అపూర్వ స్వాగతం లభించింది. స్వరాష్ట్రం హరియాణా రూ.6 కోట్ల నగదు బహుమతి ప్రకటించింది. అయితే ఒలింపిక్స్‌లో సత్తా చాటిన తమ క్రీడాకారులను శుక్రవారం ఆ రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి వాస్తవంగా నీరజ్ హాజరు కావాల్సింది. కానీ తీవ్ర జ్వరం కారణంగా ఆ కార్యక్రమానికి గైర్హాజరయ్యాడు. వైద్యుల సూచనల మేరకు నీరజ్ ఇంట్లోనే ఉంటున్నాడని సమాచారం. శుక్రవారం 103 డిగ్రీల ఉష్ణోగ్రత నీరజ్‌కు ఉంది. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి కొంత మెరుగ్గా ఉందని వైద్యులు తెలిపారు. స్వర్ణ పతకం సాధించి వచ్చిన అనంతరం నీరజ్ చాలా బిజీ అయ్యాడు. వరుస కార్యక్రమాలతో తీరిక లేకుండా ఉండడంతో జ్వరం బారినపడ్డాడని అతడి సన్నిహితుడు ఒకరు మీడియాకు తెలిపారు. జ్వరం కారణంగా ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య వేడుకలకు నీరజ్ చోప్రా దూరంగా ఉండనున్నాడు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వాతంత్ర్య వేడుకలకు హాజరు కావాలని ప్రత్యేకంగా ఆహ్వానించిన విషయం తెలిసిందే.

## పాక్ స్వాతంత్ర్య దినోత్సవం.. ట్రోల్ అవుతున్న కమ్రాన్

ఎన్ని పండుగలున్నా.. జెండా పండుగను కులమతాలకతీతంగా దేశం మొత్తం కలిసి సంబురంగా చేసుకుంటుంది. ఆగష్టు 15న భారత దేశం.. జిన్నా ఒత్తిడితో అధికార బదలాయింపు ఒకరోజు ముందు జరగడం, మరికొన్ని కారణాలతో 14వ తేదీనే పాకిస్తాన్‌లు స్వాతంత్ర్య సంబురాలు జరుపుతాయని తెలిసిందే. కాబట్టి, ఇవాళ పాక్ ఇండిపెండెన్స్ డే. ఈ సందర్భంగా క్రికెటర్ కమ్రాన్ అక్మల్ చేసిన ఓ ట్వీట్.. ట్రోలింగ్‌కు దారి తీసింది. శనివారం పాకిస్థాన్ స్వాతంత్ర్య దినోత్సవం. ఈ సందర్భంగా హ్యాపీ ఇండిపెండెన్స్‌డేకి బదులు.. ఇండిపెన్స్ అంటూ ఇంగ్లీష్‌లో తప్పు ఫొటో పోస్ట్ చేశాడు కమ్రాన్. మూములుగానే పాక్ క్రికెటర్లను ఎప్పుడు.. ఎక్కడ దొరుకుతారా? అని ఎదురు చూస్తున్న మన నెటిజన్స్.. ఈ తప్పును గుర్తించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190